



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 77 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 10 డిసెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


## రెవెన్యూ సేవలు

# మరింత సులభతరం

- రియల్ టైమ్‌లో పట్టాదారు పాస్ పుస్తకాల ఆటో మ్యూటేషన్
- 2027 డిసెంబర్ నాటికి భూముల రీ సర్వే పూర్తి కావాలి
- రెవెన్యూ శాఖ సమీక్షలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో రెవెన్యూ సేవలు మరింత సులభతరం కావాలని, చిక్కుముడులు లేకుండా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పట్టాదారు పాస్ పుస్తకాలు సహా అన్నింటా రియల్ టైమ్‌లో ఆటో మ్యుటేషన్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ఆటోమ్యూటేషన్ జరిగేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. పట్టాదారు పాస్ పుస్తకం కోసం భూ యజమానులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని, రెవెన్యూ శాఖలో ఏడాదిలోగా పూర్తి ప్రక్షాళన జరగాలని స్పష్టం చేశారు. దీనిపై ప్రతీనెలా సమీక్షిస్తానని ముఖ్యమంత్రి వెల్లడించారు. సచివాలయంలో రెవెన్యూ శాఖపై ముఖ్యమంత్రి మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఏ అధికారులు హాజరయ్యారు. పీజీఆర్ఎస్‌లో మ్యుటేషన్, పట్టాదారు పాస్ పుస్తకాలకు సంబంధించి 1,97,915 ఫిర్యాదులు వచ్చాయని సమావేశంలో అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ల్యాండ్ నేచర్, క్లాసిఫికేషన్ సంబంధిత వివాదాల దరఖాస్తులు 1,00,835, రీసర్వే అనంతరం భూమి తగ్గిందని వచ్చిన పీజీఆర్ఎస్ దరఖాస్తులు 1,00,295, జాయింట్ ఎల్‌పీఎంలపై 2,40,479 ఫిర్యాదులు నమోదైనట్టు వివరించారు.

**రీసర్వే పురోగతిపై ప్రతీ నెలా నివేదిక**

ప్రస్తుతం 6,693 గ్రామాల్లో రీసర్వే పూర్తి కాగా, ఇంకా 10,123 గ్రామాల్లో చేయాల్సి ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అయితే 2027 డిసెంబరు నాటికి రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ప్రతీ నెలా రీసర్వే పురోగతిపై నివేదిక ఇవ్వాలని నిర్దేశించారు. జాయింట్ లాండ్ పార్సెల్ మ్యాప్స్ వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని, భూమి వివరాలు డేటా బేస్ ఆన్‌లైన్‌లో ఉంటే ఈసీ జారీ చేయడం సులభమవుతుందని సీఎం అన్నారు. అలాగే 22ఏ జాబితా నుంచి తొలగించాలని వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని సీఎం సూచించారు. 22ఏ ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. డాక్యుమెంట్ల వివరాలను ట్యాంపర్ చేయకుండా మిగతా .. 2లో..

---

### ఏపీలో ఏఎండీ అసెంబ్లింగ్ యూనిట్

# ఏర్పాటు చేయండి

**ఏఎండీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వంశీతో మంత్రి లోకేష్ భేటీ**




శాన్ ఫ్రాన్సిస్కో (యూఎస్ఏ), విశ్వం వాయిస్ న్యూస్ : ఏఎండీ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విభాగం) వంశీ బొప్పనతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ విజనరీ లీడర్ చంద్రబాబు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గా తయారవుతోంది. ఏపీలో ఎలక్ట్రానిక్స్ రంగ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రానిక్స్ & సెమీ కండక్టర్ పాలసీని ప్రకటించారు. ఏపీలోని ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లలో (శ్రీసిటీ, కొప్పర్తి,) ఏఎండీ ఉత్పత్తుల అసెంబ్లింగ్, టెస్టింగ్, ప్యాకేజింగ్ యూనిట్ ఏర్పాటు చేసి, సప్లయ్ చెయిన్‌లో మిగతా .. 2లో..

---

### మిర్చి పంటలో తెగుళ్లపై

# అత్యవసర చర్యలు ప్రారంభించండి

**ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి/విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** మిర్చి పంటపై విస్తృతంగా కనిపిస్తున్న నల్ల తామర పురుగు దాడిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సీరియస్‌గా స్పందించారు. విజయవాడ క్యాంప్ కార్యాలయం నుండి ఉద్యానవన శాఖ డైరెక్టర్ డా. కే. శ్రీనివాసులతో ఫోన్ ద్వారా మాట్లాడిన మంత్రి, ప్రస్తుత పరిస్థితులపై పూర్తి నివేదికను వెంటనే అందించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని, పురుగు ప్రభావం ఉన్న ప్రాంతాలకు శాస్త్రవేత్తలను వెంటనే క్షేత్రస్థాయికి పంపాలని మంత్రి స్పష్టం చేశారు. మందుల పిచికారీపై శాస్త్రీయ సూచనలు, సాంకేతిక సలహాలను రైతులకు అందించేందుకు ప్రత్యేక బృందాలు మిగతా .. 2లో..

---

### నిబంధనలు ప్రజలను

# వేధించడానికి కాదు

**ఇండిగో సంక్షోభంపై మోదీ**



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇండిగో సంక్షోభంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. వ్యవస్థల ను మెరుగుపర్చేందుకే నిబంధనలని.. ప్రజలను వేధించడానికి కాదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎన్డీయే పక్ష సమావేశంలో ఆయన మాట్లాడారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. "ప్రభుత్వం వల్ల ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసుకోవాలి. నియమ నిబం ధనలు మంచివే. అయితే వ్యవస్థను మెరుగుపర్చేందుకు వాటిని రూపొందించాలి. అవి ప్రజలను వేధించకూడదు" అని ప్రధాని మాటలను కేంద్ర మంత్రి గుర్తుచేసుకున్నారు. "సామాన్య మిగతా .. 2లో..

---

### సోనియా గాంధీకి

# కోర్టు నోటీసులు..



**విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీకి కోర్టు నోటీసులు జారీ అయ్యాయి. భారత పౌరసత్వం రాక ముందే ఆమె పేరును ఓటరు జాబితాలో చేర్చారన్న ఆరోపణల నేపథ్యంలో దాఖలైన పిటిషన్‌పై రౌజ్ అవెన్యూలోని సెషన్స్ కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. అనంతరం సెషన్స్ కోర్టు సోనియాకు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ మిగతా .. 2లో..

---

# ప్రతి జిల్లాలో మాక్ అసెంబ్లీకి చర్యలు

**ప్రభుత్వంతో చర్చించి నిర్ణయిస్తామని వెల్లడి - బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేద్దామని పిలుపు**

**విజయవాడలో సిద్ధార్థ కాలేజీలో జరిగిన అమరావతి బాలోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్**



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వంతో చర్చించి రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక మాక్ అసెంబ్లీ జరిగేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో జరిగిన "అమరావతి బాలోత్సవం"లో సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యాసరచన, వక్తృత్వ, నృత్య, నాట్య, డ్రాయింగ్ పోటీలను స్వయంగా పరిశీలించారు. కాంతార, భరతమాత, రాణి రుద్రమదేవి, రైతు వేషంలోని చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను ఉత్సాహపరిచేలా ప్రసంగించారు. ఈ సందర్భంగా వేలాది మంది విద్యార్థులతో మిగతా .. 2లో..

---

# గోదావరి డెల్టాకు పూర్వ వైభవం

- ఉభయ గోదావరి జిల్లాల ముంపు నివారణకు లైడార్ సర్వే
- జగన్ హయాంలో గోదావరి డెల్టాకు తీవ్ర నష్టం
- డెల్టా ఆధునీకరణకు చర్యలు
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి డెల్టా ముంపు సమస్య పరిష్కరించడంతో పాటు, ఇరిగేషన్ సమస్యలను పరిష్కరించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, దీని కోసం డెల్టా ప్రాంతంలో లైడార్ సర్వే కోసం రూ.13.4 కోట్ల రూపాయలు మంజూరు చేశామని తెలిపారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. మంగళవారం అమరావతి సచివాలయంలో గోదావరి డెల్టా ఆధునీకరణ పనులపై సంబందిత ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ డిసెంబర్ కు గోదావరి జిల్లాల్లో ముంపు సమస్య మరియు లాకులు, గేట్ల మరమ్మత్తులకు సమగ్ర డిపిఆర్ తయారు చేయాలని ఏజెన్సీని ఆదేశించారు. గత 5ఏళ్ళ వైసిపి పాలనలో గోదావరి డెల్టా మోడ్రనైజేషన్ కు నిధులు ఉన్నా పనులు చేయకపోవడమే కాకుండా సగంలో ఉన్న పనులను ప్రీక్లోజర్ చేసి, 150 ఏళ్ళలో గోదావరి డెల్టాకు ఎవరూ చేయలేనంత ద్రోహం చేసి, డెల్టా అభివృద్ధికి, ఆధునీకరణ పనులకు సైంధవుడిలా జగన్ అడ్డుపడ్డారని మంత్రి నిమ్మల ఎద్దేవా చేశారు. ఆధునీకరణ పనులు మధ్యలోనే నిలిపేయడంతో ఉభయ ఉమ్మడి గోదావరి మిగతా .. 2లో..

---

### 11 నూతన ఔషధ పరిపాలనా

# భవనాలు ప్రారంభం

- వీటిలో కర్నూలు, విశాఖకు అనుబంధంగా ప్రాంతీయ ప్రయోగ శాలలు
- రూ.11.12 కోట్లతో నిర్మించిన వీటిని వర్చువల్‌గా ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్
- మరో 3 నెలల్లో స్టేట్ ల్యాబ్ వినియోగంలోకి తెచ్చేలా చర్యలు
- తద్వారా 13,000 చేరుకోనున్న మందుల నాణ్యతా పరీక్షలు
- త్వరలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ




**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో రూ.11.12 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మించిన 11 ఔషధ పరిపాలనా భవనాలు, టెస్టింగ్ ల్యాబ్‌లను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ప్రారంభించారు. మంగళగిరిలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ కార్యాలయాలను మంత్రి వర్చువల్ మిగతా .. 2లో..

---

### తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల ఆకాంక్షను

# కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది

### తెలంగాణా రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్లలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాలను ఫ్యూచర్ సిటీలోని గ్లోబల్ సమిట్ ప్రాంగణం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో రూ.5.8 కోట్లతో తెలంగాణ తల్లి విగ్రహాలను మిగతా .. 2లో..

---

# భూ వివాద రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

- రెవెన్యూ సమస్యలన్నీ ఏడాదిలోగా జాయింట్ కలెక్టర్లు పరిష్కరించాలి
- 2027 జనవరి నాటికి రీసర్వే 2.0 పూర్తి
- ఇక నుండి ఆలస్యం లేకుండా పాస్ పుస్తకాల పంపిణీ
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆటో మ్యూటేషన్
- రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ శాఖామాత్యులు అనగాని సత్య ప్రసాద్




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎటువంటి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రపందేశ్ ను తీర్చిదిద్దేంకు అవసరమైన అన్ని చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ శాఖామాత్యులు అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలోని ప్రచార విభాగంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# మరింత సులభతరం

బ్లాక్ చెయిన్ లాంటి పటిష్ట వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. భూముల వివరాలు అన్నీ పారదర్శకంగా ఆన్‌లైన్‌లో ఉంచితే వివాదాలు తలెత్తవని సూచించారు. డిస్ప్యూటెడ్ ల్యాండ్స్‌గా పరిగణించడం, వాటిని తొలగించడం వంటి అధికారం ఇన్నాళ్లూ జాయింట్ కలెక్టర్‌కు ఉండగా... ఇకపై డిస్ప్యూటెడ్ ల్యాండ్స్ పరిష్కరించే అధికారం ఆర్డీవోలకు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. చుక్కల భూములను 22ఏ జాబితా నుంచి తొలిగించే ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. 1999 వరకూ ప్రాథమిక సహకార సంఘాల వద్ద తాకట్టు పెట్టిన అసైన్డ్ భూములు కూడా 22ఏ జాబితా నుంచి తొలిగించాలన్నారు. బంజరు భూములు 1954 కంటే ముందు సేల్ డీడ్స్ రిజిస్టర్ ఆఫ్ హోల్డింగ్స్‌ను 22ఏ నుంచి తొలగించాలని చెప్పారు.

### రిజిస్ట్రేషన్ల శాఖలో రూ.10,169 కోట్ల రెవెన్యూ లక్ష్యం

'మున్సిపల్ పరిధిలో ఉన్న అసైన్డ్ భూములు మంత్రుల కమిటీ సిఫార్సు మేరకు 250 చదరపు గజాల లోపు స్థలాల్ని 50 శాతం బేస్ వాల్యూతో రెగ్యులరైజ్ చేయండి. అలాగే ఆక్వా కల్చర్ చేస్తున్న అసైన్డ్ భూముల్ని సబ్ రిజిస్ట్రార్ విలువ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలి. అలాగే...10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు కుల ధృవీకరణ పత్రం వెంటనే పొందేలా కార్యాచరణ రూపొందించాలి. ఆర్టీజీఎస్‌తో అనుసంధానించిన సమాచారం ద్వారా ఆదాయ ధృవపత్రం ఇవ్వాలి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో రూ.10,169 కోట్ల రెవెన్యూ లక్షంగా పెట్టుకున్నాం. మార్కెట్ విలువలతో భూమి విలువలు అప్ గ్రేడ్ చేయండి.' అని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు.

### రెవెన్యూ శాఖలో 86 శాతం వివాదాలు పరిష్కారం

గత ఏడాది జూన్ 15 నుంచి ఈ ఏడాది డిసెంబర్ 1వ తేదీ వరకు రెవెన్యూ శాఖకు 5,28,217 గ్రీవెన్సులు రాగా, వాటిలో 4,55,189 అంటే 86 శాతం గ్రీవెన్సులు పరిష్కారమయ్యాయని అధికారులు తెలిపారు. పరిశీలనలో మరో 73 వేల వరకు గ్రీవెన్సులు ఉన్నాయని, ఎవరైనా అర్జీల పరిష్కారంపై అసంతృప్తి వ్యక్తం చేస్తే... ఆ ఫిర్యాదులను తిరిగి ఓపెన్ చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే జూన్ 2024 నుంచి ఇప్పటివరకు 22ఏ జాబితా నుంచి తమ భూముల వివరాలు తప్పించాలని కోరుతూ 6,846 దరఖాస్తులు దాఖలు కాగా... ఎక్స్ సర్వీస్‌మెన్, రాజకీయ బాధితులు, స్వాతంత్ర్య సమరయోధులు, 1954 కంటే ముందు అసైన్డ్ భూములు కలిగిన వాళ్ల భూములు మాత్రం 22ఏ నుంచి తొలిగించనున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

### ఏపీలో ఏఎండీ అసెంబ్లింగ్ యూనిట్

# ఏర్పాటు చేయండి

భాగస్వామ్యం వహించాలని కోరారు. ఏఎండీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వంశీ బొప్పన మాట్లాడుతూ... యూఎస్ వెలుపల ఏఎండీ అతి పెద్ద ఆర్ అండ్ హబ్ భారత్ లోనే నిర్వహిస్తున్నాం. బెంగుళూరు, హైదరాబాద్, ఢిల్లీ క్యాంపస్ లలో సిలికాన్ డిజైన్, సాఫ్ట్ వేర్, ఏఐ ఆవిష్కరణలకు ప్రాధాన్యత నిస్తున్నాం. అధునాతన చిప్ ఉత్పత్తి కోసం టీఎస్ఎంసి, గ్లోబల్ ఫౌండ్రీస్, ప్యాకేజింగ్ భాగస్వామ్యాలతో కలిసి పనిచేస్తున్నాం. ఏఐ ఆధారిత డేటా సెంటర్ ట్రాన్సఫర్మేషన్, అధిక పనితీరు గల కంప్యూటింగ్, నెక్స్ట్ జెన్ గేమింగ్ లో కీలకపాత్ర పోషిస్తున్నాం. భారతీయ టెక్ దిగ్గజాలు, స్టార్టప్ లు, ప్రభుత్వ విభాగాలతో కలిసి సూపర్ కంప్యూటింగ్, క్లౌడ్ అడాప్షన్ వంటి డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టిసారించామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ లతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

### మిర్చి పంటలో తెగుళ్లపై

# అత్యవసర చర్యలు ప్రారంభించండి

పని చేయాలని సూచించారు. 2021 నుంచి రాష్టంలోని అనేక జిల్లాల్లో మిరప పంటపై నల్ల తామర పురుగు దాడి జరుగుతుండటంతో, ఈ సమస్యపై గ్రామస్థాయి అవగాహన కార్యక్రమాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా శిక్షణలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ఉద్యాన శాఖ సిబ్బందితో పాటు వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు క్షేత్ర సందర్శనలు చేపట్టి రైతులకు ప్రత్యక్ష మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నివారణ చర్యలు, అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రత్యేక కార్యక్రమాలను ఇప్పటికే అమలు చేస్తున్నామని హార్టికల్చర్ డైరెక్టర్ మంత్రి అచ్చెన్నాయుడికి వివరించారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకుంటుందని మంత్రి వెల్లడించారు.

### నివారణ మార్గాలు

ఈ పురుగు నివారణకు డా వై.యస్.ఆర్ విశ్వ విద్యాలయం వారు సూచించిన సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలి. 1. వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలి. 2. ఎకరాకి 200 కేజీల వేప చెక్కను చివరి దుక్కులో వేసుకోవాలి. 3. సిఫారుసు చేసిన మోతదులోనే ఎరువులు వేసుకోవాలి. 4. పంట మార్పిడి చేయాలి. 5. పచ్చిరొట్ట పైరును వేసుకోవాలి. 6. రైతులు సామూహికంగా ఎకరానికి 40 నుంచి 50 నీలి రంగు జిగురు అట్టలను పెట్టుకోవాలి. 7. వేప సంబందిత పురుగు మందులైన వేప నూనే (10,000 పి.పి.యం.- 1 మి.లీ లీటరు నీటికి లేదా 1500 పి.పి.యం లేదా 3000 పి.పి.యం 2 మి.లీ. 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. 8. సిఫారుసు చేసిన పురుగు మందులైన బ్రోఫ్లనిలైడ్ 20 ఎస్.సి. 34 మి.లీ., లేదా ఫ్లక్సామెటామైడ్ 20 ఈ.సి. 160 మి.లీ., లేదా ఫిప్రానిల్ 80% డబ్ల్యు .జి. 40 గ్రా., లేదా స్పైరో టెట్రామాట 15.30% ఓ.డి. 200 మి.లీ. చొప్పున 1 ఎకరానికి పిచికారి చేయాలి. వాడిన పురుగు మందునే మరల వాడకుండా మార్చి మార్చి పిచికారి చేయాలి. విచక్షణా రహితంగా తక్కువ వ్యవధిలో సిఫారుసు చేయని పురుగు మందులను వాడరాదని ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

### సోనియా గాంధీకి

# కోర్టు నోటీసులు..

తరఫు న్యాయవాది పవన్ నారంగ్ దీనిపై వాదిస్తూ.. సోనియాగాంధీకి పౌరసత్వం రాకముందే ఆమె పేరును ఓటరు జాబితాలో చేర్చారని, అందుకోసం అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై పునఃపరిశీలన అవసరమన్నారు. 1980లో ఓటర్ల జాబితాలో పేరు కోసం కొన్ని నకిలీ పత్రాలను సృష్టించి ఉంటారని అనుమానం వ్యక్తంచేశారు. ఆ తర్వాత ఆమె పేరును తొలగించి.. మళ్లీ 1983లో తిరిగి చేర్చారన్నారు. ఈ రెండు కూడా సోనియాకు పౌరసత్వం రాకముందే జరిగాయన్నారు. దీనికి సంబంధించిన కొన్ని ఆధారాలను సమర్పించారు. వీటన్నింటినీ పరిశీలించిన కోర్టు.. వివరణ ఇవ్వాలని సోనియాతో పాటు దిల్లీ పోలీసులకు కూడా నోటీసులు జారీ చేసింది. ఈ కేసుపై తదుపరి విచారణ వచ్చే ఏడాది జనవరి 6న జరగనుంది. ఇక, గతంలో ఇదే విషయంలో మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఈ వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. దీనిని పిటిషనర్ సెషన్స్ కోర్టులో సవాల్ చేయగా.. ఈ నోటీసులు జారీ అయ్యాయి.

## ప్రతి జిల్లాలో మాక్ అసెంబ్లీకి చర్యలు

అమరావతి బాలోత్సవాన్ని అద్భుతంగా నిర్వహించిన నిర్వాహకులను మంత్రి దుర్గేష్ ప్రశంసించారు. ఈ సందర్భంగా బాలోత్సవ కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహం అందించేందుకు వారధిగా పని చేస్తానని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ "మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం"అనే నినాదంతో ఈ ఏడాది అమరావతి బాలోత్సవం.. 8వ పిల్లల పండుగ నిర్వహించడం శుభ పరిణామమన్నారు. డిసెంబర్ 9 నుండి 11వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ అమరావతి బాలోత్సవం విజయవంతం అవ్వాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానన్నారు. అమరావతి బాలోత్సవం అద్భుత కార్యక్రమమని, ఇందులో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. పిల్లల ఆకాంక్షలకు ఆంక్షలు విధిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నారుల్లో సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసానికి, విద్యా ప్రగతికి, విద్యార్థుల్లో ప్రతిభా పాఠవాలను వెలికితీసేందుకు, నైతికత పెంపొందించేందుకు బాలోత్సవాలు దోహదపడుతాయని తెలిపారు. నిత్యం తరగతి గదిలో సిలబస్, పరీక్షలు, మార్కులు ఇలా ఒత్తిడితో ఉండే విద్యార్థులకు చదువుతో పాటు ఇతర అంశాల్లో వారి ప్రతిభను పరీక్షించేందుకు ఇలాంటి వేడుకలు నిర్వహించడం మంచి నిర్ణయం అని పేర్కొన్నారు. వారి శక్తి సామర్థ్యాలు, ప్రతిభను పరీక్షించే వేదికగా బాలోత్సవ వేడుకలు నిలుస్తాయనడంలో అతిశయోక్తి లేదన్నారు. విజేతలుగా నిలవడం ముఖ్యం కాదు ముందు ప్రయత్నం చేయడం ముఖ్యమని ఈ సందర్భంగా అకడమిక్, కల్చరల్ అంశాల్లో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కేవలం చదువొక్కటే కాదు ఆటపాటల్లో సైతం విద్యార్థులు పాల్గొనాలని, అప్పుడే తమలో నిగూఢంగా దాగున్న శక్తిసామర్థ్యాలు బయటపడతాయన్నారు. పిల్లల అభిరుచులు తెలుసుకొని తదనుగుణంగా ఉపాధ్యాయులు సైతం తమ బోధనా శైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. పిల్లల్లోని ఆసక్తిని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రైవేట్, ప్రభుత్వ విద్యార్థులను ఒకచోట చేర్చి వారి మధ్య ఆట పాటలు నిర్వహించడం, బృంద చర్చలు నిర్వహించడం వల్ల వారిలో స్నేహభావం, ఐకమత్యం, సమానత్వ విలువలు మెరుగుపడుతాయన్నారు. ప్రతి విద్యార్థికి చదువులతో పాటు కళలు, క్రీడలు, ఇతర అంశాల్లో ప్రావీణ్యం ఉంటుందని, తల్లిదండ్రులు తమ ఇష్టాలను పిల్లలపై రుద్దకుండా వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల్లో పట్టుదల, తపన ఉంటే వంద శాతం విజయం సాధించవచ్చని విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. విద్యార్థులు లక్ష్యం వైపు పయనించాలని, విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే పరిపూర్ణమైన విద్యార్థిగా ఎదుగుతారని మంత్రి దుర్గేష్ సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నడవడికను, వ్యవహార శైలిని, ఆలోచన ధోరణిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిరంతరం గమనించాలని పేర్కొన్నారు. పిల్లల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసినప్పుడే సమగ్ర వ్యక్తిత్వ వికాసం బయట పడుతుందని తెలిపారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యం కావాలన్నారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణకు పాటుపడదామని పిలుపునిచ్చారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా, విలువలతో కూడిన విద్యే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ఈ క్రమంలో విద్యాశాఖ వినూత్న ఆలోచనలు, విప్లవాత్మక మార్పులతో ముందుకు వెళ్తోందని మంత్రి కందుల దుర్గేష్ వివరించారు.. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అద్భుత ఆలోచనల నుండి పుట్టిన మాక్ అసెంబ్లీ ఎలా జరిగిందో అందరూ చూశారని, విద్యార్థులకు ప్రజాస్వామ్య ప్రక్రియలు, శాసనసభ పనితీరుపై ప్రత్యక్ష అనుభవాన్ని కల్పించడం, రాజ్యాంగ విలువలు, ప్రభుత్వ కార్యకలాపాలపై అవగాహన పెంచడం, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మాక్ అసెంబ్లీ నిర్వహించి విజయం సాధించడం గొప్ప విషయమన్నారు. మూడంచెల నాణ్యత తనిఖీతో విద్యార్థినీ విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో కిట్లను పంపిణీ చేసిందన్నారు. కుటుంబంలో ఎంత మంది చదువుతుంటే అంతమందికి తల్లికి వందనం క్రింద ఏటా రూ.15000 ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు.విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు పదో తరగతి, ఇంటర్మీడియట్ లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినీ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ పేరుతో సత్కరిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల ద్వారా ప్రభుత్వం విద్యార్థులకు సరైన దిశానిర్దేశం చేస్తుండటం గొప్ప పరిణామమన్నారు. తద్వారా విద్యార్థుల బలాలు, బలహీనతలు తెలుస్తాయని, . దాని వల్ల వారిని మంచి మార్గంలో నడిపించేందుకు వీలవుతుందన్నారు.. అంతేకాదు బడి పరిస్థితులు, సమస్యలు అర్థమవుతాయని, వాటిని ఆధునికీకరించేందుకు అవకాశం దొరుకుతుందన్నారు.. చాగంటి కోటేశ్వరావు లాంటి మహానుభావుడితో నైతిక విలువలపై పాఠ్యాంశాలు నేర్పిస్తుండటం గర్వించే అంశమన్నారు.. అంతేకాదు మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 పోస్టులను భర్తీ చేశాం. గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.అదే విధంగా విద్యాశాఖకు వన్నె తెచ్చే విధంగా బాలోత్సవం కార్యక్రమాలు నిర్వహించడం మంచి నిర్ణయమని, ప్రభుత్వం తరపున ప్రోత్సాహం అందే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి దుర్గేష్ అన్నారు. దేశంలోనే విద్యా రంగాన్ని నెంబర్ వన్ గా చేయాలన్న సత్సంకల్పంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారని తెలిపారు. ఏ రంగంలోనైనా నాయకత్వ లక్షణాలు అంది పుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులే ఈ దేశ భవిష్యత్తుకు పునాది అని, విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని అంతరి దుర్గేష్ అన్నారు. తరగతి గదిలోనే అది నిర్మితమవుతుందని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల, విజన్ తో ముందుకు వెళ్తేనే అద్భుతాలు సృష్టించగలమని, ఈ క్రమంలో విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆటపాటలతో, ప్రయోగాలతో కూడిన విద్యా విధానం మంచిదని ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత బయట పడుతుందన్నారు.

## గోదావరి డెల్టాకు పూర్వ వైభవం

జిల్లాల్లో ముంపు సమస్య తలెత్తడంతో పాటు లాకులు గేట్లు మరమ్మత్తుల పనులు, డ్రైన్ల లో పూడిక తీత పనులు, ఏటిగట్లను బలోపేతం చేసే పనులు నిలిచిపోయి, పంటలు నాశనమైపోయిన పరిస్థితి వచ్చిందని అన్నారు. దీని కారణంగా ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ కు ధాన్యాగారంగా ఉన్న గోదావరిడెల్టా లో ఇప్పుడు మొదటి పంట వేయలేని పరిస్థతి వచ్చిందని, రెండో పంట మాత్రమే వేయాల్సి వస్తోందని, ఇలా డెల్టా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, గోదావరి డెల్టాకు పూర్వవైభవం తీసుకొచ్చేలా వెంటనే లైడార్ సర్వే పూర్తి చేసి, డెల్టా ఆధునీకరణ పనులు మొదలుపెట్టేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు మంత్రి నిమ్మల రామానాయుడు. గత ప్రభుత్వంలో నిధులు ఉన్నా కూడా కాలువలు, డ్రైన్లలో మట్టితీయకపోగా, లాకులు షట్టర్ల కు కనీసం గ్రీజు పెట్టడానికి ఒక్కరూపాయి కూడా విడుదల చేయలేదని, మంత్రి నిమ్మల ఎద్దేవా చేశారు. ఇప్పటికే ధవళేశ్వరం బ్యారేజి కి కొత్త గేట్లను ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.150 కోట్లును మంజూరు చేశారని ఈసందర్భంగా గుర్తుచేశారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ ఎం. వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, గోదావరి డెల్టా సిస్టమ్ సిఈ, ఎస్ఈ,ఈఈలు, ఏజెన్సీ ప్రతినిధులు మరియు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల ఆకాంక్షను

# కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది

ప్రభుత్వం ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం 18 అడుగుల ఎత్తుతో విగ్రహాల నిర్మాణం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..."తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణ జరగడం ఆనందంగా ఉంది. 2009లో ఇదే రోజు (డిసెంబర్ 9) తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. 6 దశాబ్దాల ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది. ఏటా డిసెంబరు 9న తెలంగాణ తల్లి ఆవిష్కరణ ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. తెలంగాణ తల్లిని తలుచుకుని పనులు మొదలు పెట్టేందుకే విగ్రహాలు ఆవిష్కరించాం. స్వరాష్ట్ర కల నిజమై.. సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం నంబర్ వన్‌గా రూపొందుతోంది. సోనియా గాంధీ ఎన్నో అడ్డంకులు అధిగమించి మరీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన గొప్ప నాయకురాలు సోనియాగాంధీ జన్మదినం డిసెంబరు 9న కావడం మా అందరికీ సంతోషాన్ని కలిగించే పర్వదినం. ఏటా తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవాలతో పాటు, సోనియా గాంధీ జన్మదిన ఉత్సవాలను తెలంగాణ ప్రజలు నిర్వహించుకుంటారు. మా పథకాలు, కార్యక్రమాల్లో సోనియా, మన్మోహన్ స్ఫూర్తి కొనసాగుతోంది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

### 11 నూతన ఔషధ పరిపాలనా

# భవనాలు ప్రారంభం

విధానంలో ఓపెన్ చేశారు. ప్రారంభమైన వాటిలో విశాఖపట్నం, శ్రీకాకుళం, అమలాపురం, నరసరావుపేట, ఒంగోలు, కావలి, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, మదనపల్లె, కర్నూలులోని పరిపాలనా కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో విశాఖ, కర్నూలు కార్యాలయాలకు అనుబంధంగా కొత్తనా నిర్మించిన ప్రాంతీయ ప్రయోగశాలలు కూడా ఉన్నాయి. 43,000 చదరపు అడుగుల్లో జరిగిన వీటి నిర్మాణాలకు రూ.11.12 కోట్ల వరకు వ్యయంచేశారు. ఇవి వినియోగంలోనికి రానున్నందున ఏడాదికి అద్దెల రూపంలో చెల్లించే రూ.15 లక్షల వరకు ప్రభుత్వానికి ఆదా కానుంది. మంత్రి సత్యకుమార్ వీటిని ప్రారంభించిన సమయంలోనే సదరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు స్థానికంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో కలిపి వీటి నిర్మాణాలు పూర్తిచేసినట్లు చెప్పారు. కొత్తగా ప్రారంభించిన ప్రయోగశాలల్లో రూ.6 కోట్ల వ్యయంతో అత్యాధునిక పరికరాలను సమకూర్చనున్నామన్నారు. తద్వారా మందుల నాణ్యతా పరీక్షల సామర్థ్యం బాగా పెరుగుతుందన్నారు. ముఖ్యంగా ఉత్తరతీర ప్రాంతం, రాయలసీమలో ప్రాంతీయ ల్యాబులు అందుబాటులోనికి రావడంవల్ల సేకరించిన నమూనాల పరీక్షలకు రవాణ సమయం తగ్గడమే కాకుండా కల్తీ మందులు, కాలం చెల్లిన మందుల నిరోధానికి త్వరగా చెక్ పడుతుందని, అంతే కాకుండా నిఘా వ్యవస్థ మరింత పెరుగుతుందన్నారు.

### విస్తృత స్థాయిలో మందుల నాణ్యతా పరీక్షలు

ప్రస్తుతం రాష్ట్రంలో విజయవాడలోని ఔషధ ప్రయోగశాలలో ఏడాదికి 4వేల మందుల నమూనాల నాణ్యతను పరీక్షిస్తున్నట్లు మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కొత్తగా ప్రారంభమైన ల్యాబ్ ల ద్వారా మరో 3,000 మందుల నమూనాలను పెంచేందుకు అవకాశం ఏర్పడిందని చెప్పారు. విజయవాడలో నిర్మాణంలో ఉన్న రాష్ట్ర స్థాయి ల్యాబ్ మరో మూడునెలల్లో అందుబాటులోనికి వచ్చేందుకు అవకాశం ఉందన్నారు దీనివల్ల అదనంగా మరో 7,000 మందుల నమూనాల (మొత్తం 13వేలు) ను పరీక్షించేందుకు వీలుకలుగుతుందని తెలిపారు.

### రోగుల జేబు ఖర్చు తగ్గించడమే లక్ష్యం..

బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రతి మండలంలో ఒక జన ఔషధి దుకాణాన్ని ప్రారంభించేందుకు సీఎం శ్రీ చంద్రబాబు ఆమోదం తెలిపారని వెల్లడించారు. వీటికి అనుగుణంగా త్వరలో చర్యలు ప్రారంభం కానున్నాయన్నారు. ప్రభుత్వం తీసుకునే చర్యల ద్వారా వైద్య సేవలు పొందే వారి జేబు నుంచి పెట్టే ఖర్చు తగ్గాలన్నది తమ లక్ష్యమని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నడిచే అమృత్ ఫార్మసీల ద్వారా గతనెల రెండో వారం వరకు రూ. 17,000 విలువైన ఔషధాలు 50% నుంచి 90% వరకు తక్కువ ధరల మేర విక్రయాలు జరిగాయన్నారు. దీనివల్ల 6.85 కోట్ల మంది రోగులకు రూ.8.500 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న అమృత్ ఫార్మసీలను కేంద్ర ప్రభుత్వం పెంచబోతుందని తెలిపారు. వీటి రాకతో రాష్ట్రానికి అధిక ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు.

### అవినీతిని సహించేదిలేదు

ఔషధ నియంత్రణ పరిపాలనా శాఖలో ఖాళీగా ఉన్న ఎనలిస్టులు, ఇతర పోస్టులను మెడికల్ సర్వీస్ రిక్రూటుమెంటుబోర్డు ద్వారా చేపట్టనున్నట్లు రాష్ట్ర మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు రాష్ట్రంలో ఆకస్మికంగా ఏకకాలంలో తనిఖీలుచేస్తే 152కు 148 మందుల దుకాణాల్లో ఏదోఒక లోపం కనిపించిందని వెల్లడించారు. కొందరు విధుల నిర్వహణలో ప్రలోభాలకు లోనవుతున్నారని తెలిసిందని, అవినీతికి పాల్పడే వారిని ఎటువంటి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఉద్యోగులు, అధికారుల నిర్లక్ష్యంవల్ల మరొకరి ప్రాణం పోకూడదని హితవు పలికారు. మందుల నాణ్యతలో రాజీపడితే జరిగే దుష్ఫలితాలు ఎలా ఉంటాయో గుర్తించి, విధుల నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఔషధ నియంత్రణ పరిపాలనా శాఖ డైరెక్టర్ జనరల్ గిరీశా మాట్లాడుతూ కొత్త భవనాలు వినియోగంలోనికి రావడంవల్ల శాఖాపరమైన కార్యకలాపాలు మరింత వేగాన్ని అందుకుంటాయని వెల్లడించారు. రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలనా శాఖ డైరెక్టర్ ఎంపీఆర్ ప్రసాద్, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భూ వివాద రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

రెవెన్యూ శాఖ పై సమీక్షా సమావేశం జరిగిందని, ఈ సమీక్షలో పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. కృత్రిమ మేధ సహకారంతో రెవెన్యూ శాఖలో జీరో ఎర్రర్ ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. గతంలో 7,600 గ్రామాల్లో చేసిన రీ సర్వేలో జరిగిన తప్పులను ఈ ఏడాదిన్నర కాలంలో సరిదిద్దామన్నారు. రీ సర్వే 2.0 ను 2027 జనవరి నాటికి కల్లా పూర్తి చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హాయాంలో రీ సర్వే ప్రహసనంలా మార్చారని, ఆ సమస్యలన్నీ పరిష్కరించుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఆటో మ్యూటేషన్ ప్రారంభించామని, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 1.74 లక్షల ఆటో మ్యూటేషన్ లు నమోదు అయినట్లు తెలిపారు. భూమి రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆన్ లైన్ లో ఆటో మ్యూటేషన్ జరిగి ఆయా డాక్యూమెంట్స్ రిజిస్టర్ పోస్ట్ లో సదరు భూ యజమానికి చేరే విధంగా కార్యాచరణ రూపకల్పన చేశామన్నారు. కొత్త పాస్ పుస్తకాల జారీలో టెండర్ నిబంధనల కారణంగా ఆలస్యమౌతోందని, ఇక నుండి త్వరగా పాస్ పుస్తకాలు జారీ చేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ప్రత్యేకంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఖాళీగా ఉన్న జేసీ పోస్టులను వారం రోజుల్లో భర్తీ చేయనున్నామన్నారు. రెవెన్యూ సమస్యలను ఏడాది కాలవ్యవధి లోగా పూర్తిగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్లపై బాధ్యత పెడుతున్నామని చెప్పారు. ఈ ఏడాది కాలం పాటు వీరు రెవెన్యూ సమస్యల పరిష్కారంపైనే పని చేస్తారని చెప్పారు. 22ఏ జాబితాను క్లారిఫై చేసి ప్రభుత్వం, కోర్టులు జరిపిన వేలంలో కొనుకున్న భూములను ఆ జాబితా నుండి తొలగిస్తామని చెప్పారు. ఫ్రీహోల్డ్ భూముల రాష్ట్రంలో 36 లక్షల ఎకరాలు ఉండాలని, అయితే నేడు లెక్కలోకి వస్తుంది కేవలం 11లక్షల ఎకరాలు మాత్రమే అని అన్నారు. రెండు నెలల్లో ఫ్రీహోల్డ్ భూముల సమస్యలను ఖచ్చితంగా పరిష్కరిస్తామని తెలిపారు. పేదలకు మంచి చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని మంత్రి అనగాని అన్నారు. కులధృవీకరణ పత్రాలు ఆధార్ తో అనుసంధానం చేస్తున్నామన్నారు. 2.77కోట్ల కులధృవీకరణ పత్రాలు ఇప్పటి వరకు జారీ చేయడం జరిగిందన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో 86 శాతం పరిష్కరించామని, మిగిలిన 14 శాతం త్వరలో పరిష్కరిస్తామన్నారు. ప్రతి గురువారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూ సమస్యల పరిష్కార దిశగా పనిచేస్తున్నామన్నారు. ఈనాం భూముల పరిష్కారానికి రెవెన్యూ, ఎండోమెంట్ శాఖలు సమన్వయంతో పనిచేసి 45 రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని ఆదేశించామని మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. రెవెన్యూ శాఖలో ప్రతి సమస్యను పరిష్కరించాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిబద్ధతతో పనిచేస్తున్నామన్నారు. ఇక రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు ఇతర దేశాల్లో అమలు చేయబడుతున్న రిజిస్ట్రేషన్ విదానాలను అద్యయనం చేసి, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేయనున్నామని తెలిపారు. పాస్ పోర్ట్ సేవా కేంద్రాల వలే రిజిస్ట్రేషన్ కార్యాలయాల ఏర్పాటు పై సమాలోచన చేస్తున్నామన్నారు. భూ యజమానులందరూ జాయింట్ ఎల్పీఎమ్ లను వెంటనే సబ్ డివిజన్ చేయించుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో 2 లక్షల జాయింట్ ఎల్పీఎమ్ఎస్ లు ఉన్నాయని, వారిలో అవగాహన పెంచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

### నిబంధనలు ప్రజలను

# వేధించడానికి కాదు

పౌరుల్ని ఇబ్బందిపెట్టే చట్టం, నిబంధన ఉండకూడదని ప్రధాని మోదీ స్పష్టంగా చెప్పారు. చట్టాలు ప్రజలపై భారంగా పరిణమించకూడదు" అని వెల్లడించారు. వారం రోజులకు పైగా దేశీయ విమానయాన సంస్థ ఇండిగో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దాంతో రోజుకు వందల సంఖ్యలో సర్వీసులు రద్దు, ఆలస్యమవుతున్నాయి. దాంతో ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే పడిగాపులు కాస్తూ ఇబ్బందిపడుతోన్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. సమస్య పరిష్కారం దిశగా ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. ఇప్పటికీ అంతరాయాలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాలను కేంద్రం ఇప్పటికే సీరియస్‌గా తీసుకుంది. దీనిపై విచారణ కమిటీని వేసింది. ఇక ఈ అవాంతరాలకు ప్రధానంగా ఐదు అంశాలు కారణమని ఇండిగో ప్రాథమికంగా వెల్లడించింది. స్వల్ప సాంకేతిక లోపాలు, విమానాల షెడ్యూళ్లను మార్చడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, విమానయాన వ్యవస్థలో పెరిగిన రద్దీ దీనికి కారణం అని తెలిపింది. కొత్తగా అమల్లోకి వచ్చిన 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ ఫేజ్ -2 రోస్టరింగ్ నియమాలు కూడా ఒక కారణంగా పేర్కొంది. ఇప్పటికే ఈ కొత్త నియమాలను కేంద్రం తాత్కాలికంగా పక్కనపెట్టిన సంగతి తెలిసిందే.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

బుధవారం, 10 డిసెంబర్ 2025

www.viswamvoice.com




### కాకినాడ సినిమా రోడ్‌లో

# వ్యక్తి దారుణ హత్య...

## నేర స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ బిందు మాధవ్





**కాకినాడ క్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇద్దరు వ్యక్తుల మధ్య వాగ్వాదం వ్యక్తి హత్యకు దారితీసింది.పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక దుమ్ములపేటకు చెందిన అత్తిలి రంగా(42) ఆటో డ్రైవర్ గా జీవనం సాగిస్తున్నాడు. సంతచెరువు, ఎస్సార్కె సెంటర్లో కీర్తి సత్యనారాయణ(45) చెప్పులు కుట్టే వృత్తిలో ఉంటున్నాడు.మృతుడి స్వస్థలం రావులపాలెం సమీపం గోపాలపురం. ఇద్దరు పిల్లలు, బంధువులు ఉన్నారు కానీ ఎవరూ అతన్ని చూడడానికి రావడం లేదు. గత 10 సంవత్సరాలుగా రాళ్ల మేరీ (48)అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. గత రాత్రి మృతుడు మద్యం సేవించి నిందితుడు రంగాను అతని తల్లిని దూషిస్తూ అవశ్యకం లేని వాగ్వాదం చేశాడు.మంగళవారం మధ్యాహ్నం సమయంలో మృతుడు చెప్పులు కుట్టే స్థలంలో ఉండగా, ఆటో డ్రైవర్ రంగా అక్కడికి మద్యం సేవించి వచ్చి, "నిన్న నా తల్లిని దూషించావు ఎందుకు?" అని ప్రశ్నించాడు. మృతుడు "నిన్నటి విషయం గుర్తులేదు" అని చెప్పడంతో ఇద్దరి మధ్య మరలా వాగ్వాదం జరిగింది. నిందితుడు అక్కడే మృతుడి పని స్థలంలో ఉన్న కత్తిని తీసుకుని, మృతుడి ఛాతిలో పొడిచి, అదే కత్తితో అక్కడి నుండి పారిపోయాడు. ఘటనను ప్రత్యక్షంగా చూసిన రాళ్ల మేరీ వెంటనే 3 టౌన్ పోలీస్ స్టేషన్, కాకినాడకు వెళ్లి సమాచారమిచ్చింది. పోలీస్ సిబ్బంది వెంటనే ఒక ఆటో ఏర్పాటుచేసి గాయపడిన కీర్తి సత్యనారాయణను కాకినాడ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ గాయాల వలన మృతుడు మరణించాడు.హత్య సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.ఘటనా స్థలాన్ని పంచనామా చేసి, కీలక సాక్ష్యాలను సేకరించమని దర్యాప్తు అధికారికి సూచనలు ఇచ్చారు.హత్య జరిగిన మూడు గంటలలోపే పరారీలో ఉన్న ముద్దాయి రంగాను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. మరిన్ని సాక్ష్యాలు, సీసీటీవీ ఫుటేజ్, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు సేకరిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కాకినాడలో పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించిన

# అదనపు కమిషనర్ కేటీ సుధాకర్



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరంలో పారిశుధ్య నిర్వహణ పనులను మంగళవారం అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. భానుగుడి, రేచర్లపేట, దుమ్ములపేట, రాజు గృహకల్ప సముదాయం సహా పలు ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను ఆయన సమీక్షించారు. దుమ్ములపేట రైల్వే గేట్ వద్ద ప్రధాన డ్రైనేజీ అవుట్‌లెట్‌ను పరిశీలించిన అదనపు కమిషనర్, చెత్తను తక్షణమే తొలగించాలని శానిటేషన్ ఇన్స్పెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అవుట్‌లెట్ వద్ద పేరుకుపోయే చెత్తను ప్రతి రెండు రోజులకు ఒకసారి తప్పనిసరిగా తొలగించాలంటూ ఆయన సూచించారు. దుమ్ములపేట ప్రాంతంలో వాటర్ పైప్‌లైన్ లీకేజీ సమస్యను గుర్తించిన సుధాకర్, వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని వాటర్ వర్క్స్ అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా పారిశుధ్య, నీటి సరఫరా వ్యవస్థల నిర్వహణలో అలసత్వం ఉండకూడదని స్పష్టం చేశారు. అదనపు కమిషనర్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీ చరణ్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఆంగ్ల బ్రౌచర్ ఆవిష్కరణ...




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎమ్ఎస్ ఎన్ క్యాంపస్, కాకినాడలోని ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 12, 2025న నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు "రికాన్ఫిగురింగ్ జెండర్ ఐడెంటిటీస్: ఇంట్రసక్షన్స్ అఫ్ పవర్, పెర్ఫార్మన్స్, అండ్ రిప్రెసెంటేషన్ " కు సంబంధించిన బ్రోచర్ ను గౌరవ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్. ప్రసన్న శ్రీ ఈరోజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. ప్రశాంతి శ్రీ, ఆంగ్ల విభాగాధిపతి డా. ఎం. పోచయ్య, అధ్యాపకులు, బోధన మరియు బోధకేతర సిబ్బంది పాల్గొన్నారు. బ్రోషర్‌ను విడుదల చేసిన సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్. ప్రసన్న శ్రీ మాట్లాడుతూ, ఈ అంతర్జాతీయ సదస్సు విద్యార్థులు, పరిశోధకులు మరియు అధ్యాపకులకు అరుదైన శాస్త్రీయ వేదికగా నిలుస్తుందని తెలిపారు. లింగ గుర్తింపులు, అధికారం, ప్రదర్శన, ప్రతినిధ్యం వంటి సామాజిక–సాంస్కృతిక అంశాలపై ప్రపంచస్థాయి నిపుణులు మాట్లాడనున్న ఈ సదస్సును ప్రతి విద్యార్థి, పరిశోధకుడు, అధ్యాపకుడు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సదస్సులో శ్రీలంకకు చెందిన ఈస్టర్న్ శ్రీలంక యూనివర్శిటీ నుండి డా. జె.ఎస్. రోహన్ సవరిముట్టు మరియు అల్జీరియాలోని యూనివర్శిటీ ఆఫ్ గెల్మా నుండి డా. నావెల్ బెంగ్రైట్ ముఖ్య ఉపన్యాసకులుగా పాల్గొననున్నారు. విద్యార్థుల్లో పరిశోధనా ఆసక్తిని పెంపొందించడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయి ఆలోచనలను అర్థం చేసుకునే వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందని విశ్వవిద్యాలయం అధికారులు తెలియజేశారు.

# జిల్లాలో ఈ నెల 10 నుండి 21వరకు టెట్ పరీక్షలు



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో ఈ నెల10 నుంచి 21వ జరిగే టీచర్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) సజావుగా జరిగేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్ లో డీఆర్వో వెంకటరావు అధ్యక్షతన టెట్ ఎగ్జామ్ నిర్వహణపై పాఠశాల విద్యాశాఖ, రెవెన్యూ, వైద్య ఆరోగ్యం, పోలీస్, విద్యుత్, మున్సిపల్ కార్పొరేషన్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్న టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) కు కాకినాడ జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాల్లో 9,659 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్ లో జరిగే ఈ టెట్ పరీక్ష జిల్లాలో సజావుగా జరిగేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ పరీక్ష నిర్వహణకు కాకినాడ డివిజన్ లో రెండు, పెద్దాపురంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు, ఆన్ లైన్ జరిగే పరీక్ష కనుక విద్యుత్తుకు ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట ఫోటో గుర్తింపుకు ఒరిజినల్ ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలతో హాజరుకావాలని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి పి.రమేష్, కాకినాడ నగరపలకు సంస్థ అదనపు కమిషనర్ కెటీ. సుధాకర్, ఎంహెచ్ఓ డా పృధ్వీ చరణ్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కోనసీమ తిరుమల వాడపల్లి దేవస్థానానికి

# నూతన పాలకమండలి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

## ధర్మకర్తలమండలి సభ్యులుగా17 మంది నియామకం



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ఖ్యాతిగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానానికి ప్రభుత్వం నూతన పాలకమండలిని ఏర్పాటు చేసింది. మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వులతో మొత్తం 17 మంది సభ్యులు ఉన్న నూతన బోర్డును అధికారికంగా ప్రకటించింది. పాలకమండలి చైర్మన్‌గా ముదునూరి వెంకటరాజు(గబ్బర్ సింగ్ రాజు)ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డైరెక్టర్లుగా చలుమూరి రాంబాబు, గంగవరపు పద్మావతి, కాసా చాముండేశ్వరి, కొల్లుబోయిన శ్రీనివాసరావు, పెండెం కుమారి, పెండ్యాల భవాని, సలాది నాగేశ్వరరావు, సరెళ్ల సరిత, ఏపుగంటి విజయ కుమారి, చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయి ప్రసాద్, యల్లమిల్లి చంద్రకుమారి, కొండపల్లి రామచంద్రరావు, శిష్టా సూర్య కుటుంబరావు, దాలిపర్తి శ్రీలక్ష్మి, గోసాల అప్పల నరస వంటి సభ్యులను ప్రభుత్వం ఎంపిక చేసింది.కొత్త పాలకమండలి నియామకాలను ప్రకటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృతజ్ఞతలు తెలిపారు.కొత్త బోర్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎమ్మెల్యే సత్యానందరావు స్వామివారి సేవలో ప్రతి సభ్యుడు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి. దేవస్థానం అభివృద్ధి, సౌకర్యాల విస్తరణ, భక్తుల సేవలో బోర్డు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి అని సూచించారు.

### స్వామివారి ట్రస్ట్ బోర్డులో

# అగ్నికుల క్షత్రియులకు ప్రముఖస్థానం కల్పించండి




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో రెండవ తిరుపతిగా పేరుగాయించి వెలసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని అగ్నికుల క్షత్రియ వంశస్థులు అయినటువంటి పినపోతు గజేంద్రుడు ఆలయాన్ని నిర్మించి ధూప దీప నైవేద్యానికి కొంత ఆస్తిని ఇచ్చి ప్రపంచ స్థాయిలోనే పేరుగాయించే విధంగా చేసినారు గత ప్రభుత్వాల సమయంలో స్వామివారి ట్రస్ట్ బోర్డులో అగ్నికుల క్షత్రియులకు ప్రముఖస్థానం కల్పించేవారు. క్రమేపి అగ్నికులక్షత్రియ వంశస్థులను విస్మరించి వారిని ఈ దైవ కార్యక్రమాలనుంచి దూరం చేస్తూ ప్రస్తుతం ప్రకటించిన లిస్టులో ఆగికులక్షత్రియులకు వెన్నుపోటు పొడిచే విధంగా ఒక్కరికి కూడా అవకాశం కల్పించకుండా మొండి చేయి చూపించడం జరిగింది. ఈ చర్య చాలా హేయంగా ఉండటమే కాకుండా యావత్ అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి అవమానకారంగా ఉంది.కావున ప్రభుత్వం దీనిపైన వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అగ్నికులక్షత్రియ సంగం నాయకులు డిమాండ్ చేస్తున్నారు, ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం అని పత్రికా సుముఖమునకు తెలియచేసారు.. ఇదే విషయంపై సోమవారం జిల్లా కలెక్టర్ వారికి వినతిపత్రం అందించామని గుర్తు చేసారు. ఈకార్యక్రమంలో అగ్నికులక్షత్రియ సంగనాయకులు పెద్దలు పాల్గొని వాళ్ల డిమాండ్లను మీడియాకు తెలిపినట్లుగా చెప్పారు.

# ఈనెల 10 నుండి 21వ తేదీ వరకు ఏపీ టెట్ పరీక్షలు

## సమర్థవంతంగా నిర్వహించుటకు సిద్ధంగా ఉండాలి : జిల్లా రెవిన్యూ అధికారి మురళి



**పల్నాడు జిల్లా, విశ్వం వాయిస్ ప్రతినిధి :** జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో ఈనెల 10 నుండి 21వ తేదీ వరకు ఏపీ టెట్ పరీక్షలు సజావుగా సమర్థవంతంగా నిర్వహించుటకు సిద్ధంగా ఉండాలని జిల్లా రెవిన్యూ అధికారి మురళి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షల నిర్వహణపై జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మురళి మాట్లాడుతూ జిల్లాలో పరీక్షలు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాల్సి ఉందన్నారు. పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలులో ఉండేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేరుకునే విధంగా కావాల్సినన్ని బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించుటకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. స్క్వాడ్లుగా నియమించబడిన శాఖాపరమైన అధికారులు పరీక్షా కేంద్రాలను తరచూ తనిఖీ చేసి పరీక్షలు సజావుగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. పరీక్షా సమయంలో ఎలాంటి అంతరాయం లేకుండా అంతర్జాలం, విద్యుత్ సౌకర్యం ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

**పరీక్ష కేంద్రాలు**

1. నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజ్, కొటప్పకొండ రోడ్, ఎల్లమండా పివో, నరసరావుపేట 2. ఎంఎం రెడ్డి మెమోరియల్ ఇంజినీరింగ్ & టెక్నాలజీ కాలేజ్ వినుకొండ రోడ్, పెట్లూరివారిపాలెం పీవో, నరసరావుపేట మండలం. 3. ఎంఎఎం మహిళా ఇంజినీరింగ్ కాలేజ్ కేసనుపల్లి, నరసరావుపేట మండలం. 4. నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజ్ ఆటోనమస్ బ్లాక్-4, కొటప్పకొండ రోడ్, ఎల్లమంద.. 5. తిరుమల ఇంజినీరింగ్ కాలేజ్, నరసరావుపేట, జొన్నలగడ్డ గ్రామం, నరసరావుపేట మండలం.

### కోటి సంతకాల సేకరణకు

# భారీ స్పందన

## నియోజకవర్గ ఇంచార్జి బలసాని కిరణ్ కుమార్



**గుంటూరు, విశ్వం వాయిస్ ప్రతినిధి :** గుంటూరు రూరల్ మండలం, ఏటుకూరు బైపాస్ రోడ్డులో గల, ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జి బలసాని కిరణ్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి భారీ స్పందన లభించిందని అని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలంతా ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు అని తెలిపారు మరియు రేపు ఉదయం జరగబోవు కారక్రమానికి నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో పాల్గొని, కూటమి ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ గళం వినిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో, ప్రత్తిపాడు & తెనాలి నియోజకవర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్ మరియు ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షులు మరియు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతి ఐక్యతను చాటేందుకు మాదిగల ఆత్మీయ కలయిక

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మాదిగ జాతి సమైక్యతను చాటి చెప్పేందుకు ఈనెల 11వ తేదీన అమలాపురం పేరూరు కొంకాపల్లి ఎత్తు రోడ్డు సత్తెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో మాదిగల ఆత్మీయ కలయిక నిర్వహిస్తున్నట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్ తెలిపారు. మాజీ ఎంపీ నందిగమ సురేష్‌ను ఆయన స్వగృహం తాడేపల్లి ఉద్దండరాయ పాలెం ఆయన స్వగృహం లో మంగళ వారం ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ తో కలసి సుధాకర్ అక్కడికి వెళ్ళారు. ఆత్మీయ సభ రావాలని ఆహ్వానించించారు. తను అమలాపురం వస్తానని సురేష్ చెప్పారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ మాదిగల ఐక్యతను చాటి చెప్పేందుకు ఈనెల 11వ తేదీన సత్యమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో మాదిగల ఆత్మీయ కలయికను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ఆత్మీయ కలయిక సభకు మాదిగ కులానికి సంబంధించిన అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలను ఆహ్వానిస్తున్నామన్నారు.రాబోయే రోజుల్లో అంబేద్కర్ కోనసీమ జిల్లా పూర్వీభజన అయితే రెండు ఎమ్మెల్యే స్థానాలు మాదిగలకు కేటాయించాలని కోరారు. మాదిగలను గుర్తిస్తూ ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. ఆయనతోపాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంటెలెక్చువల్ ఫారం కార్యదర్శి కొడమంచిలి హరీష్ ఆయనతో ఉన్నారు.

# ఆరు నెలల్లో రాజ్యసభ ఎన్నికలు..

## టీడీపీలో మొదలైన పైరవీల పర్వం



ఏపీలో వచ్చే ఏడాది మే-జూన్ నెలల మధ్యలో జరిగే రాజ్యసభ సభ్యుల ఎన్నికపై అప్పుడే వేడి మొదలైంది. మొత్తం నాలుగు స్థానాలు ఖాళీ అవుతాయి. ఈ నాలుగు స్థానాలను టీడీపీ కూటమి పార్టీ గెలుచుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏపీ నుంచి 11 మంది నేతలు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఇద్దరు టీడీపీ, ఇద్దరు బీజేపీ కాగా, మిగిలిన ఏడుగురు ప్రతిపక్షం వైసీపీ సభ్యులు. వచ్చే ఏడాది జూన్ లో పదవీ విరమణ చేయనున్న సభ్యుల్లో ముగ్గురు వైసీపీ, ఒక టీడీపీ సభ్యుడు ఉన్నారు. వైసీపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారిలో ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వాని పదవీ కాలం వచ్చే ఏడాది జూన్ 21తో పూర్తి కానుంది. అదేవిధంగా గత ఏడాది డిసెంబరులో జరిగిన ఉప ఎన్నికలో టీడీపీ తరఫున గెలిచిన సానా సతీష్ పదవీకాలం కూడా ఆ రోజుతోనే ముగియనుంది. ఈ నేపథ్యంలో జూన్ కన్నా ముందు ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఏదిఏమైనప్పటికీ రాజ్యసభ ఎన్నికలకు ఇంకా ఆరు నెలల సమయం ఉంది. అయితే కూటమిలో ప్రస్తుతం ఉన్న పోటీతో పలువురు నేతలు ఇప్పటి నుంచి రాజ్యసభ రేసును మొదలుపెట్టారని అంటున్నారు. కూటమిలో మూడు పార్టీలు ఉండగా, నాలుగు స్థానాలను ఎలా పంచుకుంటాయనే దానిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు రాజ్యసభకు ఉప ఎన్నికలు జరిగాయి. తొలుత మూడు స్థానాలకు, ఆ తర్వాత ఒక స్థానానికి ఎన్నిక జరిగితే టీడీపీ, బీజేపీ చెరో రెండు సీట్లు చొప్పున తీసుకున్నాయి. కూటమిలో మరో భాగస్వామి అయిన జనసేనకు ఇప్పటి వరకు రాజ్యసభకు అవకాశం దక్కలేదు. ఈ పరిస్థితుల్లో వచ్చే ఏడాది జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో జనసేనకు ఓ సీటు కేటాయిస్తారా? అనేది ప్రధాన చర్చనీయాంశం అయింది. గతంలోనే జనసేన నేత నాగబాబుకు రాజ్యసభ సీటు ఇస్తారని భావించారు. అయితే బీజేపీ ఒత్తిడితో జనసేన సీటు వదులుకోవాల్సి వచ్చిందని అంటున్నారు. దీంతో మరో ఆరు నెలల్లో జరిగే రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ బదులుగా జనసేన పార్టీకి చాన్స్ వస్తుందని అంటున్నారు. ఇదే సమయంలో టీడీపీ మూడు సీట్లు తీసుకుంటుందా? మిత్రపక్షాలకు చెరోసీటు కేటాయించి రెండు సీట్లతోనే సరిపెట్టుకుంటుందా? అనే చర్చ కూడా జరుగుతోంది. టీడీపీకి ఎన్ని సీట్లు వచ్చినప్పటికీ ఆ పార్టీలో రాజ్యసభ సీటు కోసం చాలా పెద్ద పోటీనే కనిపిస్తోందని అంటున్నారు. గత ఏడాది ఎన్నికైన సానా సతీష్ కేవలం ఏడాదిన్నరలోనే పదవీ విరమణ చేస్తుండటంతో ఆయనకు మళ్లీ రెన్యువల్ చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. మంత్రి లోకేశ్ కు అత్యంత సన్నిహితుడిగా సానా సతీష్ గుర్తింపు తెచ్చుకున్నారు. అదే సమయంలో కేంద్ర పెద్దల వద్ద ఆయనకు మంచి పరపతి ఉందని అంటున్నారు. దీంతో కేంద్రంతో లాబీయింగ్ కోసం సానా సతీష్ సేవలను వినియోగించుకుంటారని అంటున్నారు. గతంలో ఈ పనిని సీనియర్ నేత కంభంపాటి రామ్మోహనరావు చేసేవారు. ఆయన కూడా ఇప్పుడు రాజ్యసభ ఆశిస్తున్నారు. అదేవిధంగా గత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండిపోయిన గల్లా జయదేవ్, పొత్తుల్లో భాగంగా సీట్లు కోల్పోయిన దేవినేని ఉమా, పిఠాపురం వర్మ, జవహర్ తోపాటు సీనియర్ నేత వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు తదితరులు కూడా రాజ్యసభ బెర్తును ఆశిస్తున్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా ఉప ఉపముఖ్యమంత్రి పవన్ కోసం సీటు వదులుకున్న పిఠాపురం వర్మకు ఏదైనా ప్రత్యామ్నాయం చూపాలనే డిమాండ్ ఎక్కువగా వినిపిస్తోంది. అయితే వర్మతోపాటు సీటు ఆశిస్తున్న వారిలో ఎక్కువ మంది అగ్రవర్ణాల వారే ఉన్నారని, సామాజిక సమతుల్యం కోసం బీసీ, ఎస్సీ నేతలకు అవకాశం ఇవ్వాలనే ప్రతిపాదనను కూడా తెరపైకి తెస్తున్నారు. దీంతో టీడీపీలో రాజ్యసభ రేసు తీవ్ర ఉత్కంఠ రేపుతోందని అంటున్నారు.

# కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఖాతాలో మరో రికార్డ్!



గత ఏడాది జూన్ లో మోడీ 3.0లో కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులందరిలో అత్యంత ధనవంతుడిగా గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ నిలిచిన సంగతి తెలిసిందే. రూ.5,705 కోట్ల ఆస్తులను ప్రకటించిన ఆయన.. గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఈ సమయంలో తన ఖాతాలో అంతకంటే గొప్ప రికార్డును చేర్చుకున్నారు! అవును... ఏపీలో 25 మంది ఎంపీల పనితీరుపై జరిగిన ఓ సర్వేలో గుంటూరు ఎంపీ, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అగ్రస్థానంలో నిలిచారు. 8.9 స్కోరుతో ఆయన ఈ స్థానాన్ని దక్కించుకున్నారు. దీంతో అటు ఏపీ రాజకీయాలకు, ఇటు పార్లమెంటరీ రాజకీయాలకు పూర్తిగా కొత్త, తొలిసారి ఎంపీగా గెలిచిన వ్యక్తికి ఇది ఎలా సాధ్యమైందనేది ఆసక్తిగా మారింది. వైద్యుడు, 'యూ వరల్డ్' వైద్య విద్య వ్యవస్థాపకుడు అయిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్.. అమెరికా నుంచి వచ్చిన తర్వాత 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి గుంటూరు ఎంపీ అభ్యర్థిగా రాజకీయ అరంగేట్రం చేశారు. ఆ ఎన్నికల్లో సమీప వైసీపీ అభ్యర్థిపై 3,44,695 ఓట్ల మెజారిటీతో గెలుపొంది.. సరికొత్త చరిత్ర సృష్టించారు. బుర్రిపాలెంలో జన్మించిన పెమ్మసాని చంద్రశేఖర్.. ఉస్మానియాలో వైద్య విద్యను అభ్యసించి, అమెరికా వెళ్లి తిరిగి వచ్చి, తొలిసారి ఎంపీ అయ్యి, వెంటనే కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు తీసుకుని.. ఏపీ ఎంపీల పనితీరులో టాప్ ప్లేస్ లో నిలవడానికి ప్రధాన కారణం... ఆయన అనవసర రాజకీయ తగాదాలకు దూరంగా ఉంటూ.. ప్రజాసేవపైనే ప్రధానంగా దృష్టి పెడతారని అంటున్నారు పరిశీలకులు. దీనికి తోడు ఏపీ రాజధాని అమరావతి ఈయన ఎంపీగా ఉన్న ప్రాంత పరిధిలోకే రావడంతో.. ఇక్కడి రైతులు తమ ఎంపీ నుంచి బలమైన ప్రాతినిధ్యం ఆశిస్తున్నారని.. ఇక్కడి రైతులకు నిత్యం టచ్ లో ఉంటూ, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలోనూ కీలక భూమిక పోషించే దిశగా హామీ ఇస్తున్నారని.. ఇవన్నీ వెరసి పని తీరులో పెమ్మసానిని టాప్ ప్లేస్ లో నిలిపాయని చెబుతున్నారు. మరోవైపు ఏపీకి చెందిన ఎంపీలు పార్లమెంటులో తమ మొదటి సంవత్సరంలో మొత్తం 1,576 ప్రశ్నలు లేవనెత్తగా... అందులో 1,081 ప్రశ్నలు టీడీపీకి చెందిన ఎంపీల నుంచే రావడం గమనార్హం. అంటే సగటున తెలుగుదేశం పార్టీ ఎంపీలు ఒక్కొక్కరు 77.2 ప్రశ్నలు అడిగారు. ఇది జాతీయ సగటు 46.8 కంటే చాలా ఎక్కువ!

### చిలకలూరిపేట ప్రశాంతి వృద్ధాశ్రమంలో

# ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో అన్నదానం



**చిలకలూరిపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రశాంతి వృద్ధాశ్రమంలో ఒక ముఖ్యమైన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.కుటుంబ సభ్యులలో ఒకరు తమ అమ్మమ్మగారి జ్ఞాపకార్థంగా వృద్ధులకు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి షేక్ మస్తాన్ వలి హాజరై,తమ చేతుల మీదుగా వృద్ధులకు అన్నదానంచేశారు.ఈ సందర్భంగా షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ వృద్ధుల పట్ల ప్రేమ జీవితంలో విలువైన అనుభవాలను, ఆశీర్వాదాలను అందించే వృద్ధులకు సేవ చేయడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయనఉద్ఘాటించారు.కేవలం వృత్తి పరమైనబాధ్యతలతో పాటు, ఏపీయూడబ్ల్యూజే కుటుంబ సభ్యులు ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయం అని కొనియాడారు. తమ అమ్మమ్మ జ్ఞాపకార్థం ఒక మంచి కార్యక్రమం ద్వారా ఇతరుల ఆకలి తీర్చడానికి కృషి చేసిన కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే పల్నాడు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అడపా అశోక్ కుమార్, సెక్రటరీ షేక్ దరియావలి గూడూరు సుబ్బు, కొచ్చర్ల చందు, పెనుమల మనోహర్, నరసింహల శ్రీకాంత్ ,సభ్యులు వృద్ధాశ్రమం నిర్వాహకులు మరియు పలువురు పాల్గొన్నారు.

### దివ్యాంగుల గృహాలకు

# అర్హుల జాబితా తయారు చేయాలి



**గుంటూరు, విశ్వం వాయిస్ ప్రతినిధి :** దివ్యాంగులకు గృహాలు మంజూరుకు అర్హుల జాబితా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల గృహాలపై కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హుల జాబితా తయారు చేయాలని అందులో వారి ఆధార్ చిరునామా, జాబ్ కార్డు తదితర వివరాలను పరిశీలించాలని అన్నారు. అవసరమైతే ఆధార్ చిరునామా మార్పు చేయాల్సి ఉంటుందని, అందుకు వారి సంసిద్ధతను తెలుసుకోవాలని సూచించారు. జిల్లాకు చెందిన వారిని పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి మరియు ఇన్ ఛార్జ్ జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు డి.దుర్గాభాయి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకూ 91 దరఖాస్తులు అందగా వాటిలో జిల్లాలో ఆధార్ కలిగిన వారు 72 మంది ఉన్నారని, 19 మంది ఇతర జిల్లాలకు చెందినవారు ఉన్నారని చెప్పారు. ఇవి కాకుండా మరో 12 దరఖాస్తులు అందాయన్నారు. అందిన మొత్తం దరఖాస్తుల వివరాలు పూర్తిగా పరిశీలించాల్సి ఉందని, ఈ నెల 11వ తేదీన సమావేశాన్ని నిర్వహించి పూర్తి స్థాయిలో పరిశీలన చేయనున్నట్లు తెలిపారు. గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి జె.వి.ఎస్.ఆర్.కె ప్రసాద్ మాట్లాడుతూ పిఎం గ్రామీణ క్రింద మంజూరు చేయుటకు జాబ్ కార్డు అవసరం ఉందని వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీతో దూరం..

## మరో సీనియర్ నేత కుటుంబంపై ఆసక్తికర చర్చ



వైసీపీకి చెందిన సీనియర్ నేత మేకపాటి రాజమోహనరెడ్డి కుటుంబం పార్టీ నుంచి దూరంగా జరుగుతుందా? అన్న చర్చ జరుగుతోంది. వైసీపీ ఆవిర్భావం నుంచి అధినేత జగన్ కు అండగా ఉంటూ వచ్చిన మేకపాటి కుటుంబం కొద్దిరోజులుగా సైలెంటుగా ఉన్నట్లు చెబుతున్నారు. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహనరెడ్డి వయసు పైబడటంతో ఆయన గతంలో వలే చురుగ్గా రాజకీయాలు చేయడం లేదు. ఆయన సోదరుడు చంద్రశేఖరరెడ్డి గత ఎన్నికలకు ముందే పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కుమారుడు విక్రమ్ రెడ్డి, మరో సోదరుడు మేకపాటి రాజగోపాల్ రెడ్డి ప్రస్తుతం వైసీపీలో ఉన్నారు. అయితే ఇటీవల కాలంలో మేకపాటి కుటుంబం పార్టీపై అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా మాజీ సీఎం జగన్ వ్యవహారశైలిని తప్పుబడుతూ కొద్దిరోజుల క్రితం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహనరెడ్డి మాట్లాడారు. దీని తర్వాత పరిస్థితిలో మరింత మార్పు వచ్చిందని, ఆయనకు పార్టీకి గ్యాప్ పెరిగిపోయిందనే ప్రచారం జరుగుతోంది. "మాజీ సీఎం జగన్మోహనరెడ్డి చుట్టూ చేరిన వారి భజన వల్ల నష్టం జరుగుతోందని గత నెలలో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహనరెడ్డి వ్యాఖ్యానించారు. చుట్టూ ఉన్న నేతలు భజన చేయడం వల్ల పొంగిపోతున్న మాజీ సీఎం జగన్ క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నారని మేకపాటి చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. దీంతో మేకపాటి ఆలోచనలపై అప్పట్లోనే చర్చ జరిగింది. అయితే పార్టీ మేలు కోసమే ఆయన అలా వ్యాఖ్యలు చేయాల్సివచ్చిందని అధిష్టానానికి సమాచారం అందిందని అంటున్నారు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ, మేకపాటి కుటుంబం కొద్ది రోజులుగా సైలెంటుగా ఉంటుండంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వయసురీత్యా మేకపాటి క్రియాశీల రాజకీయాలు చేయకపోయినా, నెల్లూరు జిల్లాలో ఆయన కుటుంబ ప్రభావాన్ని తీసిపారేయలేమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో మేకపాటి, ఆయన సోదరుడు చంద్రశేఖరరెడ్డి వారి కుటుంబం తరఫున చురుకైన రాజకీయాలు చేసేవారు. చంద్రశేఖరరెడ్డి టీడీపీలో చేరిపోయారు. వయసురీత్యా మేకపాటి సోదరులు ఇద్దరూ తమ వారసులనే రాజకీయాల్లో కొనసాగిస్తున్నారు. అయితే మాజీ ఎంపీ మేకపాటి కుమారుల్లో ఒకరైన గౌతంరెడ్డి మరణించారు. మరో కుమారుడు విక్రమ్ రెడ్డి గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. పార్టీ ఓడిన తర్వాత ఆయన ఇంతకుముందులా చురుగ్గా తిరగడం లేదు. ఇక మేకపాటి మరో సోదరుడు రాజగోపాలరెడ్డి గత ఎన్నికల్లో ఉదయగిరి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అయితే ఇప్పుడు మేకపాటి కుటుంబంలో ఏ ఒక్కరూ చురుగ్గా వైసీపీ తరఫున రాజకీయాల్లో కొనసాగడం లేదని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా అధినేత జగన్మోహనరెడ్డి వైఖరిపై అసంతృప్తితో రగిలిపోతున్నారని అంటున్నారు. ఇతర పార్టీలతో కూడా సంప్రదింపులు మొదలుపెట్టారని అంటున్నారు. కూటమిలోని టీడీపీలో చేరాలా.. బీజేపీతో రాజకీయాలు కొనసాగించాలనే విషయమై రాజమోహనరెడ్డి కుటుంబం ఆలోచిస్తోందని ప్రచారం జరుగుతోంది. గత నెలలో జగన్ చుట్టూ భజనపరులు ఉన్నారని వ్యాఖ్యల ద్వారా తన అసంతృప్తిని వ్యక్తం చేసినా, పార్టీ నుంచి ఎవరూ రాజమోహనరెడ్డిని సంప్రదించలేదని చెబుతున్నారు. ఇది కూడా ఆయన అసంతృప్తిని మరింత రాజేందని అంటున్నారు. మొత్తానికి మేకపాటి వ్యవహారం ప్రస్తుతం వైసీపీలో హాట్ టాపిక్ అవుతోంది. అయితే ఆయన రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం ఇప్పుడే ఉంటుందా? ఎన్నికల వరకు వేచిచూస్తారా? అనేది చూడాల్సివుంది.

# జెన్ జెడ్ పోస్టాఫీస్.. విద్యార్థుల కోసం వినూత్న ఆలోచన




విద్యార్థుల కోసం పోస్టల్ శాఖ వినూత్న ఆలోచన చేసింది. యూనివర్సిటీల ప్రాంగణంలో జెన్ జెడ్ పోస్టాఫీసులను ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ ఆధునిక పోస్టాఫీసుల్లో సిబ్బంది ఎవరూ ఉండరు. విద్యార్థులే ఆధునిక సాంకేతికతను ఉపయోగించి తమ సేవలను స్వయంగా పొందేలా తీర్చిదిద్దారు. ఈ కొత్త ప్రయోగం ఢిల్లీలో సత్ఫలితాలు ఇవ్వడంతో ఏపీలోనూ ప్రవేశపెట్టారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలిసారి విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలో జెన్ జెడ్ పోస్టాఫీసును మంగళవారం ప్రారంభించారు. జెన్-జెడ్ థీమ్ తో పనిచేయనున్న ఈ పోస్టాఫీసులను గత నెలలోనే ఢిల్లీలో ప్రారంభించారు. నవంబరు 19న ఢిల్లీ ఐఐటీలో 20న ఢిల్లీ యూనివర్సిటీలో జెన్ జెడ్ పోస్టాఫీసులు ప్రారంభమై విజయవంతంగా నడుస్తున్నాయి. దీంతో ఈ తరహా పోస్టాఫీసులను దేశవ్యాప్తంగా విస్తరించాలని తపాలా శాఖ నిర్ణయించింది. ఆంధ్రా యూనివర్సిటీలో మంగళవారం ప్రారంభమైన జెన్-జెడ్ పోస్టాఫీసును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. లోపలికి అడుగు పెట్టగానే ఓ కేఫ్ కు వచ్చామా? అన్న అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేశారు. ఒక్క ఉద్యోగి కూడా లేకుండా నడిచే ఈ పోస్టాఫీసును పూర్తిగా విద్యార్థులే నిర్వహించుకోవాల్సి వుంటుంది. పోస్టాఫీస్ లోపలికి ప్రవేశించగానే క్యూఆర్ కోడ్‌ల చిత్రాలు, వాటిని స్కాన్ చేస్తే ఏ రకమైన సేవలు అందుతాయో తెలిపే వివరాలతో బోర్డులు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎవరికి వారే మొబైల్ ఫోన్ ద్వారా పోస్టల్ సేవలు నిర్వహించుకోవాలి. ఒకవేళ ఏదైనా అవసరమైన సాయం అందించేందుకు తపాలాశాఖ నుంచి ఒక ఉద్యోగి మాత్రమే అందుబాటులో ఉంటారు. పోస్టల్ విభాగం కేవలం లేఖలను బట్వాడా చేయడానికే కాకుండా నేటి డిజిటల్ యుగానికి అనుగుణంగా పనిచేస్తుందని, ఆధునిక సాంకేతిక సేవలు అందించే కేంద్రంగా మార్పు చెందిందని ప్రచారం చేయాలనే ఉద్దేశంతోనే జెన్-జెడ్ పోస్టాఫీసులకు శ్రీకారం చుట్టినట్లు చెబుతున్నారు. వచ్చే ఏడాది జనవరి నాటికి దేశవ్యాప్తంగా 46 విద్యాసంస్థల్లో జెన్-జెడ్ పోస్టాఫీసుల ప్రారంభానికి కేంద్రం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఈ జెన్ జెడ్ పోస్టాఫీసులను సోషల్ లెర్నింగ్ స్పేస్ గా తీర్చిదిద్దడం ఆకట్టుకునే అంశం. జెన్-జెడ్ పోస్టాఫీసులో విద్యార్థులు ఉచితంగా వైఫై సౌకర్యం ఉపయోగించుకోవచ్చు. పుస్తకాలు చదువుకునే లైబ్రెరీ కూడా ఉంటుంది. అంతేకాకుండా సౌకర్యవంతంగా కూర్చొని ఆర్ట్ ప్రదర్శనలను వీక్షించవచ్చు. క్యాంపస్ లో విద్యార్థులు, పరిశోధకులు, స్థానిక నివాసితులు స్వేచ్ఛగా సమయం గడపడానికి సౌకర్యంగా ఉంటుంది. ఇంటరాక్షన్ జోన్ గా వినియోగించుకోవచ్చు. ఈ పోస్టాఫీసుల్లో క్యూఆర్ కోడ్ ఆధారిత పార్సిల్ బుకింగ్, విద్యార్థులకు అవసరమైన స్పీడ్ పోస్ట్ డిస్కౌంట్ లతో సహా స్మార్ట్ సర్వీసులు ఉన్నాయి. జెన్-జెడ్ పోస్టాఫీసులో ఆర్ట్ కార్నర్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో విద్యార్థులు గీసిన చిత్రాలు, స్కెచ్‌లు, ఫొటోగ్రాఫ్‌లను ప్రదర్శిస్తారు. అంతేకాకుండా యువ కళాకారులను ప్రోత్సహించే వేదికగా ఉపయోగపడుతుంది. క్యాంపస్‌లో సృజనాత్మక వాతావరణాన్ని పెంచుతుందని అంటున్నారు. విద్యాలయాలను శక్తివంతమైన ప్రదేశాలుగా తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చొరవను ఇది ప్రతిబింబిస్తుందని కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ తెలిపింది.

విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
బుధవారం, 10 డిసెంబర్ 2025
www.viswamvoice.com





## కోనసీమలో జిల్లా ప్రభుత్వాసుపత్రిని

# తక్షణమే నిర్మించాలి..

**అత్యవసర ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి**
**377 ద్వారా లోకసభలో కోరిన ఎంపీ హరీష్ బాలయోగి**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని తక్షణమే నిర్మించాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి 377 ద్వారా లోకసభలో కోరారు. జిల్లాలో అత్యవసర ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు లోపించడం వల్ల గ్రామీణ, విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో వైద్యపరమైన సమస్యలపై దృష్టి సారించి జిల్లాలో నెలకొన్న ఆరోగ్య పరిస్థితిపై తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఆసుపత్రి లేకపోవడంతో అత్యవసర చికిత్స కోసం పక్క జిల్లాలపై ఆధారపడుతున్నారన్నారు. జిల్లాలో ట్రామా, పాలీ ట్రామా సెంటర్ లేదా క్రిటికల్ కేర్ సెంటర్ లేకపోవడం వలన క్లిష్టమైన కేసులకు సకాలంలో ప్రాణాపాయ చికిత్స అందించడం సాధ్యం కావడం లేదన్నారు. 17 లక్షలకు పైగా జనాభాకు కేవలం తొమ్మిది సామాజిక ఆరోగ్య కేంద్రాలు మాత్రమే సేవలు అందిస్తున్నాయని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే అనేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్లు అందుబాటులో లేకపోవడం వల్ల మాతా శిశు సంరక్షణ సేవలు అందించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కేన్సర్ డే సెంటర్ మంజూరైనప్పటికీ దాని నిర్మాణం ఇప్పటివరకూ మొదలు కాలేదని అన్నారు. కేన్సర్ రోగులు స్థానికంగా చికిత్స పొందలేక ఇబ్బందులు పడటంతో పాటు చికిత్స కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. మంజూరైన డే కేర్ కేన్సర్ సెంటర్ ను యుద్ధ ప్రాతిపదికన కార్యరూపం దాల్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే మిగిలిన అన్ని సౌకర్యాలను, లోపాలను, సరిదిద్ది డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలకు నాణ్యమైన, ఆరోగ్య సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ హరీష్ బాలయోగి కోరారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు సోనియా గాంధీ జన్మదిన వేడుకలుఏఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 79 వ పుట్టినరోజు సందర్భంగా అమలాపురం గడియార స్తంభం సెంటర్లో కేక్ కట్ చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండుసార్లు ప్రధానమంత్రి పదవి త్రుణప్రాయంగా వద్దని చెప్పి మన్మోహన్ సింగ్ని ప్రధానమంత్రి చేసిన త్యాగమూర్తి, స్వర్గీయ రాజీవ్ గాంధీ మరణం తర్వాత బాధను దిగమింగుకొని కాంగ్రెస్ పార్టీ బాధ్యతలను భుజాన వేసుకుని ముందుకు నడిపించిన ధైర్యశాలి, ఆమె ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ(సి పి పి) చైర్ పర్సన్ గా ఉన్నారు. రెండువేల 24 లో రాజస్థాన్ నుండి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమె ఆశయాలను కాంగ్రెస్ పార్టీ ద్వారా కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్, అమలాపురం నియోజకవర్గ కన్వీనర్ అయితాభత్తుల సుభాషిని, పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి, ఎసిసి మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్ ముషిణి రామకృష్ణారావు, బీసీ నాయకులు కుడుపూడి శ్రీనివాస్, మండల అధ్యక్షులు ఏలేశ్వరం రాధాకృష్ణ, పట్టణ ఉపా అధ్యక్షులు పేరి శర్మ, పట్టణ కార్యదర్శి ముల్లేటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వస్కా బాబు, సుగ్గు ప్రసాద్, అరిగెల శ్రీరామ్ మూర్తి, అయితే బత్తుల కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ సీతమ్మ సేవా సంస్థ ఆర్థిక సహాయం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంక గ్రామంలోమెకానిక్ పని చేస్తున్న శ్రీనివాస్కి పక్షవాతం వచ్చి ఒక కాలు చెయ్యి పడిపోయింది. అమ్మ సీతమ్మ సేవా సమితిని సహాయం కోరగా 3000 రూపాయలుక్యాష్ మరియు కిరణా సరుకులు ఇచ్చి వారి కుటుంబమునకు సహాయం అందించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వారికి సమత సభ్యులకు సంస్థ తరఫున ధన్యవాదాలు తెలిపారు.

### వాడపల్లి ఆలయం వద్ద ఆలయ నిర్మాత అగ్నికుల క్షత్రియుడు

## పినపోతు గజేంద్రుడు విగ్రహం ఏర్పాటు చేస్తాం.. : కొత్తపేట ఎమ్మెల్యే బండారు




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నేటి యువతరానికి అగ్నికుల క్షత్రియ పెద్దల గొప్పదనం తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. పినపోతు గజేంద్రుడు 17వ శతాబ్దంలో వాడపల్లి ఆలయాన్ని నిర్మించారని ఆయన నిర్మించిన ఈ ఆలయం ఈరోజు జగద్విఖ్యాతమైందని, గజేంద్రుడువారు కారణజన్ముడని కొనియాడారు. రావులపాలెం శ్రీ కృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన అగ్నికుల క్షత్రియ సమావేశంలో జనసేన ఇంచార్జి బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ తో కల్సి ఆయన పాల్గొని ప్రసంగించారు. వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాత పినపోతు గజేంద్రుడి వారి విగ్రహం ఏర్పాటు చేస్తామని అన్నారు. భక్తులందరికీ సెల్ఫీ పాయింట్ గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆయన చరిత్ర శాశ్వతంగా ఉండేలా చేస్తామన్నారు. ఒక వారం రోజుల్లో స్థలాన్ని ఏర్పాటు చేసి అగ్నికుల క్షత్రియులు ఏదైతే కోరుకున్నారో ఆ విధంగా, వారు సంతృప్తి వ్యక్తం చేసే విధంగా విగ్రహం ఏర్పాటు జరుగుతుందన్నారు. కీ.శే పినపోతు గజేంద్రుడు వారు నిర్మించిన ఆలయం తిరుమల తరువాత తిరుమలగా అభివృద్ధి చెందుతుందన్నారు. సమాజమే దేవాలయం పేద ప్రజలే దేవుళ్ళు అనేది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం అన్నారు. అగ్నికుల క్షత్రియులు అంటే ఎప్పుడూ తెలుగుదేశం పార్టీకి బలమన్నారు.ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ పేద ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. మత్స్యకార భృతి సాయాన్ని నూరు శాతం పెంచి రూ. 20వేలు అందించడం జరిగిందన్నారు. తుఫాను సాయంగా జిల్లాలో 28వేల మందికి 50కిలోల చొప్పున బియ్యం, ఆరు రకాల నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందించడం జరిగిందన్నారు. గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ పైప్ లైన్ వల్ల ఉప్పు నీరు వచ్చి మత్స్యకారులు వేట లేక ఉపాధి కోల్పోతున్నారని అంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాజీ ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావుతో కల్సి మీటింగ్ పెట్టి పరిహారం కోరడం జరిగిందన్నారు. బొబ్బర్లంక వరకూ ఉన్న మత్స్యకారులకు సైతం పరిహారం ఇవ్వాలని పోరాడుతున్నామని ప్రభుత్వం ద్వారా ఒత్తిడి తెచ్చి మిగిలినవారికి ఇచ్చే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కాకినాడ విద్యా దాత మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ గురించి, అంతర్వేది ఆలయాన్ని నిర్మించిన కొపనాతి కృష్ణమ్మ గురించి నేటి తరం తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో చిలువూరి సతీష్ రాజు,కొప్పిశెట్టి ప్రసాద్, తోట స్వామి అగ్నికుల క్షత్రియ సంఘాల ప్రెసిడెంట్లు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

### ప్రాణాలు పోయే ప్రమాదం ఉన్నందున

## తలకు ఖచ్చితంగా హెల్మెట్ వినియోగించాలి : సిఐ విద్యాసాగర్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రోడ్డు ప్రమాదాలలో హెల్మెట్ లేకపోవడం వల్ల మరణించే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నందున ఇకపై హెల్మెట్ ఎవరు వాడకపోయినా కఠిన చర్యలు తప్పవని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్ హెచ్చరించారు. ఆలమూరు కొత్తూరు సెంటర్లో మంగళవారం ఆయన స్థానిక ఎస్సై జి.నరేష్తో కలిసి హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకపోవడం వల్ల తలకు బలమైన గాయాలై మరణిస్తున్నారని అధికారిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. అందువల్ల ఇకపై ఈ హెల్మెట్ వినియోగం పై గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా హెల్మెట్ వాడకపోతే కఠినమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. దీనిపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. అందువల్ల కొత్తపేట డిఎస్పి సుంకర మురళీ మోహన్ ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. మేము నెమ్మదిగా వెళతాము ప్రమాదాలు ఉండవనుకోవడం తప్పని ఎదుటివారి వల్ల కూడా ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరు ఈ హెల్మెట్ ను ఖచ్చితంగా వాడాలన్నారు. మనం వాడే సెల్ ఫోన్ భద్రతకే ఖరీదైన రక్షణ గార్డులు ఏర్పాటు చేస్తామని అలాంటిది ప్రాణాలు పోయే ప్రమాదం ఉన్నందున తలకు ఖచ్చితంగా హెల్మెట్ వినియోగించాలని సిఐ విద్యాసాగర్ సూచించారు.

## కలెక్టరేట్ నందు జిల్లాస్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వ్యవసాయానుబంధ రంగాల రుణాల కల్పనలో ప్రాంతీయ భౌగోళిక పరిస్థితులను బట్టి పెట్టుబడి ఖర్చులను స్కేల్ ఫైనాన్స్ ప్రకారం పరిమితులను పెంచాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు, మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సహకార బ్యాంకు సీఈవో కమిటీ కన్వీనర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అరటి, కొబ్బరి మత్స్య పంటల రుణాల పరిమితు ల నిర్ధారణ వరి, అరటి, కొబ్బరి, మత్స్య పంటల రుణ పరిమితుల పశుసంవర్ధక పాడి పశువుల పెంపకం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ధారణకు రాష్ట్ర స్థాయి టెక్నికల్ కమిటీ సిఫార్సులను పరిగణన లో తీసుకున్నట్లు తెలిపారు జిల్లా కమిటీ సభ్యులు సమక్షంలో పలు రకాలుగా చర్చలు జరిపి సిఫార్సుల ను సమీక్షించి పెంపు చేసిందన్నారు. పెంపుతో అన్ని పంటలకు రుణాలు ముసాయిదాను రూపొందించారని వాటిపై త్వరలో నిర్ణయాలు వెలువడతాయన్నారు పంటల వారీగా రుణ పరిమితుల ఈ పరిమితు లు కమిటీ సిఫార్సులు, ఖర్చులు, దిగుబడి ఆధారంగా నిర్ణయించబడ్డాయన్నారు. 2025-26 ఖరీఫ్, రబీ సీజన్లకు ఎస్ ఎల్ టి సి పెంపులు జరిగాయనీ అలాగే అరటికి మత్స్యకు పరిమితులు పెంచారన్నారు నాబార్డ్ వ్యవ సాయం, పశుసంవర్ధకం, మత్స్య, ఉద్యానవన, ప్రధాన వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు, ఎన్జీవోలు సంబంధిత జిల్లాలోని కొంతమంది ప్రగతిశీల రైతుల ప్రతినిధులు సభ్యులుగా నియ మించారన్నారు కొన్ని పరిమితులను మరల పునః సమీక్షించాలని అధికారులకు సూచించారు జిల్లా స్థాయి లో ప్రతి పంటకు ఆర్థిక స్కేల్ నిర్ధారించి ప్రతి పంటకు రైతుకు అర్హత కలిగిన రుణాన్ని నిర్ణయించడం జరిగిందన్నారు ఫైనాన్స్ స్కేల్, పండించిన పంట సాగు విస్తీర్ణం ఆధారంగా నిర్ణయించడం జరిగిందన్నా రు. రుణ పరిమితులు నిర్ణయించ డంలో జిల్లా టెక్నికల్ కమిటీ ప్రధాన పాత్ర పోషించిందన్నారు ఇవి ఆమోదం పొందిన తర్వాత, ప్రతిపాదనలు రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ కి పంప బడతాయన్నారు. జిల్లా స్థాయి పరిస్థి తులు, వేసవి పంటలు ఉంటే సహా వివిధ పంట కాలాలకు జిల్లాలో పండించే అన్ని ముఖ్యమైన పంటలకు, వివిధ వ్యవసాయ వాతా వరణ పరిస్థితులు, పంటల విధానం, సాగు పద్ధతులు మొదలైన వివిధ అంశాలను పరిగ ణనలోకి తీసుకుని, ఎకరానికి స్టాండర్డ్ ఆప రేషన్ పరిధిని సూచిస్తూ పరిమితులు నిర్ణయించామన్నారు. సాంప్రదాయ ఆధునిక వ్యవసాయ పద్ధతులు వ్యవసాయ పద్ధతుల్లో స్థానిక వైవిధ్యాలు ఏవైనా ఉంటే, వాటికి కూడా ప్రత్యేక ప్రమా ణాలుగా సూచించడం జరిగిందన్నారు సీఈవో టి పవన్ కుమార్ మాట్లాడుతూ పశుసంవర్ధక పాడి రంగం రుణాలు.పాడి పశువులు ఆవులు, గేదెలు గొర్రెలు, మేకల పెంపకానికి మూలధన పెట్టుబడుల కోసం దీర్ఘకాలిక రుణాలు అందుబాటులో ఉన్నాయని .షెడ్ నిర్మాణం, పశువుల కొనుగోలు, మేత గడ్డి సాగు, పరికరాల కొనుగోలు వంటి అవసరాలకు ఈ రుణాలను వినియోగించుకునే అవకాశం కల్పించబడిందన్నారు కేంద్ర%-%రాష్ట్ర పథకాలు పశుసంవర్ధక మౌలిక సదుపాయాల నిధి వంటి పథకాలతో అనుసంధానం చేసి కొంతమేర సబ్సిడీ ప్రయోజనాలు రైతులకు అందజేయబ డనున్నాయన్నారు.సంబంధిత శాఖల మార్గదర్శకా లకు అనుగుణంగా ఎంపికైన యూనిట్లకు పశుసంవర్ధక రంగంలో శిక్షణ, సాంకేతిక సహాయం కూడా కల్పించబడుతుంద న్నారు, రైతులు, పశుపోషకులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని ఆదాయాన్ని పెంచుకునేలా ప్రోత్సాహాన్ని అందించాలన్నారు.ఈ సమావేశంలో వ్యవసాయ, శాఖ అధికారి బోసుబాబు ఉద్యాన అధికారి వివి రమణ, మత్స్య శాఖ అధికారి పీవీ శ్రీనివాసరావు పశుసంవర్ధన శాఖ అధికారి మనోజ్ కుమార్ , ఎల్డిఎం కేశవ్ వర్మ, యు బి ఐ అగ్రికల్చర్, హెడ్ రవి, నాబార్డ్ డిడిఎం స్వామి నాయుడు, తదితరులు పాల్గొ న్నారు

### ఇండిగో విమాన సంస్థపై

## చర్యలకు కేంద్రం సిద్ధం కావాలి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** గుప్తధిపత్యమే విమానయానంలో ప్రస్తుత పరిస్థితులకు కారణం కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును టార్గెట్ చేస్తూ వైసీపీ దిగజారుడు రాజకీయాలకి పాల్పడుతోంది మంత్రిగా రామ్మోహన్ నాయుడు పనితీరును కేంద్రంలో ప్రతి ఒక్కరు ప్రశంసిస్తున్న వారే. వైసీపీ వారు మాత్రం కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి, పరువు పోయింది అని మాట్లాడటం వారి వక్ర బుద్ధికి నిదర్శనం పరిస్థితి చక్కబెట్టడానికి గత నాలుగు రోజులుగా కేంద్రమంత్రి శ్రమ పడుతున్న తీరు పలువురు ప్రశంసలు అందుకుంటుంది ప్రయాణికులకు 610 కోట్లు రీఫెండ్ గా చెల్లించడం, ఇతర విమాన సర్వీసులు పెంచడం దేశ ప్రజలు గమనిస్తున్నారు అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు తెలియజేశారు.

### ఆత్మీయ సమావేశం వద్ద

## మోకా సబ్బారావు జన్మదిన వేడుకలు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణం వాస్తవ్యులు, ప్రముఖ కాంట్రాక్టర్ అల్లాడ వెంకటరమణ స్థానిక వాటర్ హౌస్ దగ్గర నారా చంద్రబాబు నాయుడు ఉద్యానవనం(పార్క్) లో ఏర్పాటు చేసిన ఆత్మీయ విందు సమావేశంలో, బిజెపి మాజీ ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు పుట్టినరోజు వేడుకలు జరిగాయి.ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, కౌన్సిలర్లు బొర్రా వెంకటేశ్వరరావు, చిక్కాల రాంబాబు, తిక్కిరెడ్డి నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బోనం సత్తిబాబు, చింతల పూడి సత్తిబాబు, తిక్కిరెడ్డి వాసు, గోకరకొండ సూరిబాబు, కొమ్ములు సురేష్, అత్తిలి వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి నాయుడు, సాధనాల ఆది శేషు, చిక్కాల డాక్టర్ బాబు, ముద్దుబాబు, మండేల బాబీ, శ్రీను గంధం తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో వున్నారు.

### కుక్క కరిసిందని ఫోన్ చేస్తే

## నర్సు దారుణ వ్యాఖ్యలు..

**వైద్య ఆరోగ్యశాఖలో ఎంఎల్హెచ్పీ నిర్వాకం..**
**నువ్వేమైనా సీఎం చంద్రబాబు నాయుడువా అంటూ ఎటకారం..**



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కుక్కకాటుకు గురైన ఓ మహిళకు ప్రాథమిక చికిత్సకోసం ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఎంఎల్హెచ్పీకు ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడమే కాకుండా నువ్వేమైనా సీఎం చంద్రబాబు నాయుడు వా అంటూ ఎటకారంగా మాట్లాడడంపై బాధితురాలు ఉన్నతాధికారులకు పిర్యాదు చేసింది.. ఈ సంఘటనకు సంబందించి బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లవరం మండలం బోడసకుర్రులో అంగన్ వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న దొమ్మేటి కృష్ణవేణి డ్యూటీకు వెళ్తుండగా వీధి కుక్క దాడిచేసి కరిచింది.. దీంతో ఆమె తీవ్ర భయభ్రాంతులకు గురయ్యింది. దీనిపై స్థానికులు అది పిచ్చికుక్క అని చెప్పడంతో మరింత భయభ్రాంతులకు గురై ఆందోళనకు గురైంది.. ఈక్రమంలోనే వెంటనే గ్రామంలో ఎంఎల్హెచ్పీగా విధులు నిర్వర్తిస్తున్న విజయ కు ఫోన్ చేయగా ఆమె ఎత్తలేదు. ఇలా మూడు సార్లు ఫోన్ చేసినా ఎత్తకపోగా అంతలో అక్కడికి వచ్చిన బాధితురాలి భర్త కూడా ఎంఎల్ హెచ్పీ విజయకు ఫోన్ చేశాడు. చివరకు నాలుగు సార్లు చేయగా ఫోన్ లిఫ్ట్ చేసిన ఎంఎల్హెచ్పీ తీవ్ర అసహనం ప్రదర్శిస్తూ కుక్క కరిస్తే వెంటనే ఫోన్ ఎత్తేయాలా..? నవ్వు ఏమైనా సీఎం చంద్రబాబు నాయుడువా నువ్వు ఫోన్ చేసిన వెంటనే ఎత్తేయడానికి అంటూ దారుణంగా మాట్లాడిందని వాపోయింది. తాను వచ్చే దాకా ఉంటే ఉండు లేకుంటే మానేయ్ అని ఫోన్ పెట్టేసిందని తెలిపింది. దీంతో చేసేది లేక స్థానికులు, భర్త సాయంతో అల్లవరం 30 పడకల ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నట్లు తెలిపింది. సాటి ఉద్యోగి అని కూడా చూడకుండా ఇంత దారుణంగా మాట్లాడిన నర్సు విజయ పై చర్యలు తీసుకోవాలని వారు అధికారులకు పిర్యాదు చేసినట్లు తెలిపారు.

**గోడిలంక పీహెచ్సీ సిబ్బంది అంటేనే నిర్లక్ష్యమా...?**

గోడిలంక పీహెచ్సీ అనగానే సిబ్బంది వివాదాలకు కేరాఫ్ అడ్రస్గా మారిందని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పీహెచ్సీ సిబ్బంది విధి నిర్వహణలో అలక్ష్యాన్ని ప్రశ్నిస్తున్నందుకే అదనపు డాక్టర్ బాలరాజుపై సిబ్బంది తప్పుడు ఫిర్యాదు చేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే డాక్టర్ను వేరే పీహెచ్సీకు డిప్యుటేషన్పై వెళ్లేలా రాజకీయ పైరవీలు చేయించారని, ఆస్థాయిలో ఇక్కడ రాజకీయాలు ఉన్నాయంటున్నారు. ఇప్పుడు తాజాగా బోడసకుర్రు ఎంఎల్హెచ్పీ ఓ పేషెంట్పై దారుణ వ్యాఖ్యలు చేయడం సంచలనంగా మారింది. అయినా ఉన్నతాధికారులు ఈ పీహెచ్సీపై దృష్టిపెట్టి చక్కదిద్దడంలేదని స్థానికులు మండిపడుతున్నారు.

గర్భిణీలకు కత్తిపూడి ధర్మసత్రం

# అన్నదాన సేవలు ప్రారంభం..!

ప్రజా సమస్యలుంటే నాకూ, సురేషుకూ చెప్పండి - ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ






**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పెద్దాపురం రాజ్య సంస్థానపు మూడో మహారాణి బుచ్చి సీతయ్యమ్మ 1928 లో కత్తిపూడిలో ప్రారంభించిన ధర్మ సత్రం అన్నదాన సేవలు పలు మజిలీలు తీసుకుని 97 ఏళ్ల తర్వాత చారిత్రాత్మక అన్నదాన సేవలకు పునరంకితం అయ్యింది. సంస్థానం 100 ఏళ్ళ సేవల పరంపరలో ముందు ఎన్నడూ లేని విధంగా తొలి సారిగా గర్భిణీలకు అన్నదాన సేవలను అందించాలని చారిత్రాత్మక కార్యాచరణను నేడు ప్రారంభించింది. గతంలో బాటసారులు, అన్నార్తులు, ప్రతిభ గల నిరుపేద విద్యార్థులు అన్నదాన సేవలను అందించిన ఈ ధర్మ సత్రం దాదాపుగా ఈ సేవలు కుంటుపడుతున్న దశలో ఆ అన్నదాన సేవలకు కొనసాగింపుగా గర్భిణీ స్త్రీలకు అన్నదాన సేవలను మంగళవారం సరికొత్తగా ప్రారంభించారు. భారత ప్రభుత్వ కుటుంబ, ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకంలో ప్రతి నెలా 9 వ తేదీన గర్భిణీ స్త్రీలు అందరికీ సమగ్రమైన నాణ్యమైన ఉచిత వైద్య పరీక్షలు, ప్రసవానంతర సంరక్షణను, భరోసాను అందిస్తున్నారు. ఈ పథకంలోని ఈ సేవలను పొందేందుకు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం నుంచి శంఖవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంనకు, అలాగే రౌతులపూడి మండలం నుంచి రౌతులపూడి సామాజిక ఆరోగ్య కేంద్రానికీ ప్రతీ వచ్చే గర్భిణీ స్త్రీలు, వారి వెంట వచ్చే సంరక్షకులకూ మధ్యాహ్నం పూట ఉచితంగా అందించే అన్నదాన సేవలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మంగళవారం ప్రారంభించారు. నవంబర్ 22 న బుచ్చి సీతాయమ్మ 190 వర్ధంతి వేడుక నిర్వహణకు సమాలోచన చేసేందుకు ధర్మసత్రం నూతన పాలకవర్గం అధ్యక్షుడు సోమరౌతు చంద్రమౌళి అధ్యక్షతన అదే నెల శుక్రవారం 14 న కత్తిపూడి బుచ్చి సీతాయమ్మ ధర్మసత్రంలో నిర్వహించిన తొలి సమావేశంలో అధ్యక్షుడు చంద్రమౌళి ఓ వినూత్న ప్రతిపాదన చేశారు. అదే ఈ గర్భిణీలకు అన్నదాన సేవలను అందించడం. అనుకున్నదే తడవుగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖకు ఈ ప్రతిపాదనలను పంపడం, ఆమోదం లభించడంతో అన్నదాన నిర్వహణకు టెండర్లను పిలిచారు. శంఖవరం, రౌతులపూడిలోని ఆస్పత్రుల్లో అన్నదాన సేవలను అందించే టెండరును ఒకే ఏజెన్సీ దక్కించుకుంది. దీంతో ఈ రోజు ఈ అన్నదాన సేవలు ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభిం చారు. ఐతే ఈ ఉచిత అన్నదాన సేవలను ఎంత కాలం ముందుకు కొనసాగించాలని అనుకుంటున్నారో ధర్మసత్రం పాలకవర్గం, కార్యనిర్వహణ అధికారి యర్రా వెంకటేశ్వరరావు, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ వద్ద ఓ సమగ్ర ప్రణాళిక అంటూ ఉన్నట్లు లేదు. ధర్మ సత్రంకు రౌతులపూడి మండలంలో ఉన్న భూములు, కత్తిపూడిలో ధర్మ సత్రం భూములు, వాణిజ్య దుకాణాల ద్వారా వచ్చే ఆదాయ లభ్యతను బట్టే ఈ అన్నదాన పథకం ముందుకు కొనసాగ గలదు. ఈ అన్నదాన సేవలను ప్రారంభించే ముందు శంఖవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆసాంతం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలతో మాట్లాడుతూ ఆస్పత్రి నిర్వహణలో, వైద్య సేవలను అందించడంలో ఏవైనా నిర్మాణాత్మక సమస్యలు ఉంటే తనకు గానీ, పూర్వపు తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ పూర్వపు ప్రచార కార్యదర్శి పర్వత సురేష్ దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి ఒక సూర్యకిరణ్, తుని ప్రాంతీయ ఆత్మ సంఘం ఉపాధ్యక్షుడు కరణం సుబ్రహ్మణ్యం, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గాబు సుభాష్, ఉపాధ్యక్షుడు తలపంటి అప్పారావు (బుజ్జి), శంఖవరం ప్రభుత్వ ప్రధాన వైద్యుడు శెట్టిబత్తుల శ్రీరామ రాజీవ్ కుమార్, ద్వితీయ వైద్యులు మన్మోహన్ సాయిరెడ్డి, దంత వైద్యుడు రవిశంకర్, సత్రం అధ్యక్షుడు సోమరౌతు చంద్రమౌళి, మిగతా పాలకవర్గం సభ్యులు, ధర్మసత్రం కార్యనిర్వహణ అధికారి యర్రా వెంకటేశ్వరరావు, ఆస్పత్రుల సిబ్బంది, ఎన్.డీఏ. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధి పనులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి

ఏపీవో కుమారస్వామి




**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు మండలంలోని ప్రతి గ్రామంలో ప్రారంభమయ్యాయని పనులను వేతన దారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో కుమారస్వామి తెలిపారు. మండలంలో శరభవరం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఎంజిఎన్ఆర్ఇజిఎస్ గ్రామసభలలో ముందుగా గత కాలంలో చేసిన పనుల యొక్క వివరాలను, రాబోయే సంవత్సరంలో జరగబోయే పనులను సామాజిక తనిఖీ బృందం వివరించారు. ఈ సందర్భంగా ఏపీవో కుమారస్వామి మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో మార్పులు చేపట్టడం జరిగిందని ఇకపై పనులకు వచ్చే ప్రతి వేతన దారుడు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని, పని సమయంలో పని ప్రారంభించే ముందు పని పూర్తి అయిన తర్వాత రెండుసార్లు ఫోటో తీయించుకోవాలని అప్పుడు మాత్రమే పే ఆర్డర్ జనరేట్ అవుతుందని ఉదయం ఫోటోలో ఉండి చివర ఫోటోలో లేని పక్షంలో జనరేట్ అవ్వడం జరగదని తెలిపారు. ఎవరు పేరు ఉంటే వాళ్లకే మస్టరు వేయబడుతుందని లేని వాళ్ళకి వేయడం జరగదని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఎవరికైనా మొక్కలు వేసుకునే ఉద్దేశం ఉంటే ఉద్యానవన శాఖ ద్వారా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎకరానికి లక్ష రూపాయలు చొప్పున మూడు సంవత్సరాల వరకు ప్రభుత్వం ఒక పైసా కూడా ఆశించకుండా మీకు డబ్బులు ఇవ్వడం జరిగిందని దీని ద్వారా కొబ్బరి,మామిడి, జీడి మామిడి నిమ్మ, నారింజ, బత్తాయి పంటలు వేసుకు నేందుకు ఖాళీ స్థలంలో గానీ కొండ పోడు భూముల్లో కానీ వేసుకోవచ్చని తెలిపారు. ఇవే కాకుండా కాలువలు పూడిక తీత, చెరువులు పూడికితీత, చేలలో నీరు నిలవ ఉంచేందుకు పారం పనులు, మట్టి కొట్టుకుపోకుండా ఉండే పనులు, చెట్లు పెంచే పనులు ఉపాధి పనుల్లో చేపట్టడం జరుగుతుందని, అలాగే భూములు ఉన్నవాళ్లకి, ఆవులు ఉన్నవాళ్లకి క్యాటిల్ షెడ్ అనేది రావడం జరిగిందని ఒక షెడ్డుకు రెండు లక్షల రూపాయల వరకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు, గ్రామాల్లో సిసి రోడ్లు కూడా ఉపాధి కూలీలు ద్వారా వేయడం జరుగుతుందని తెలిపారు. వేతన దారులకు రోజు వేతనం 307 రూపాయలు వరకు వచ్చిందని ప్రతి ఒక్కరు కష్టపడి వేతనం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక తనిఖీ పరిశీలకులు మండల విద్యా శాఖ అధికారి అచ్చిరాజు, గ్రామ సర్పంచ్ అమరాది వెంకట్రావు, సెక్రటరీ, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరకంచిలో ఏవో జోకా అమృత ఆధ్వర్యంలో

# పొలం పిలుస్తోంది కార్యక్రమం




**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తర కంచి గ్రామంలో రైతు సేవా కేంద్రం నందు మండల వ్యవసాయ శాఖాధికారిణి జోకా అమృత ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో జోకా అమృత పలు విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ విత్తన శుద్ధి చేసుకుని విత్తనం మరియు నేల ద్వారా సంక్రమించే తెగుళ్లు,పురుగుల నుండి ఏవిధంగా అప్రమత్తం అవ్వాలో రైతులకు వివరించారు. అదే విధంగా గత సీజన్లో పండించిన పంట అవశేషాలను కాల్చి వేయకుండా వాటిని నేలలో కలియ దున్నడం వలన నేలకొంది పోషకాలు గురించి వివరించారు. మరియు కోతలు అనంతరం రైతులు నేలను ఖాళీగా ఉంచకుండా సంవత్సరం పొడువునా పచ్చదనం ఉండాలంటే ఏదో ఒక పంట వేసి ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె.మణికంఠ, గ్రామ సర్పంచ్ మంతెన వెంకటరమణ, సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ల అప్పారావు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# చిరు ధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారీ




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** చిరు ధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయొచ్చని మండల వ్యవసాయ అధికారి పడాల గాంధీ రైతులకు సూచించారు. జాతీయ ఆహారభద్రత, పోషకాహార మిషన్ పథకంలో భాగంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం యరకాపురంలో రాగి పంటలో సామూహిక ప్రదర్శన క్షేత్రం - క్షేత్ర దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ... రైతులు చిరు ధాన్యాలు సాగు చేయడం వల్ల పోషకాహారంతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీతో ఆర్థికంగా లాభాలు పొందవచ్చని తెలిపారు. అనంతరం రాగి పంటలో పంట కోత ప్రయోగం నిర్వహించి 4.8 కిలోల దిగుబడి గమనించడం జరిగింది. చిరు ధాన్యాల విత్తనాలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పంటలు, వివిధ రకాల కషాయాల ప్రదర్శనశాల ఏర్పాటు చేసి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్, వ్యవసాయ ఉద్యాన సహాయకులు సువర్ణరాజు, ప్రసాద్, క్రాంతి, జగదీశ్, మణికంఠ, చిన్నారి, రాజు, శ్యాం, గోవిందరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామరాజు, మల్లీశ్వరి, కొండమ్మ, సోమాలమ్మ, కుమార్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# పోర్టు రంగంలో భారీ సంస్కరణలు

దేశవ్యాప్తంగా 'వన్ నేషన్ వన్ పోర్ట్ ప్రాసెస్' అమలు..

ఎంపీ సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు కేంద్రం సమాధానం.,



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలోని అన్ని ప్రధాన, ముఖ్యేతర ఓడరేవులలో కార్యకలాపాల వ్యవస్థను ఏకరీతిలో అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సుప్రతిష్టంగా ముందడుగు వేసింది. "ఒకే దేశం –ఒకే పోర్ట్ ప్రాసెస్" ఫ్రేమ్‌వర్క్ అభివృద్ధి, అమలు చర్యలపై స్పష్టత ఇస్తూ పోర్టులు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ రాజ్యసభలో మంగళవారం సమాధానమిచ్చారు. రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు స్పందించిన కేంద్రం మంత్రి సమాధానం ఇస్తూ, దేశవ్యాప్తంగా పోర్టుల పనితీరు, డిజిటల్ వ్యవస్థలు మరియు నియంత్రణ ప్రక్రియలను ఏకరీతిలో అమలు చేయడం ఈ ఫ్రేమ్‌వర్క్ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. "ఈ చర్యలు అన్ని పోర్టులలో సమాన ప్రామాణీకరణను అందించడంతోపాటు లాజిస్టిక్స్ రంగంలో పారదర్శకత, కార్యక్షమతను పెంచుతాయి" అని తెలిపారు. %సాచీరా% అమలులో భాగంగా నేషనల్ లాజిస్టిక్స్ పోర్టల్ (సాగర్ సేతు)ను అప్‌గ్రేడ్ చేస్తుండటం ముఖ్యాంశంగా మంత్రి పేర్కొన్నారు. దేశంలోని అన్ని పోర్టులలో షిప్పింగ్ సంబంధిత సమాచారాన్ని ఎలక్ట్రానిక్‌గా సజావుగా సమర్పించడం మరియు ప్రాసెసింగ్ చేయడం కోసం ఈ వేదికను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేదికపై కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్, పోర్ట్ హెల్త్ ఆర్గనైజేషన్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ వంటి కీలక విభాగాలను ఒకే చోట అనుసంధానించడం జరుగుతుందని కేంద్రమంత్రి వివరించారు. ఒఎన్ఒపి అమలు ద్వారా డాక్యుమెంటేషన్‌లో సుమారు 33 శాతం తగ్గింపు చోటు చేసుకోనున్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది. దీని వల్ల సరుకు నిర్వహణ సామర్థ్యం పెరుగుతుందని, పోర్టు కార్యకలాపాల సమయ వ్యయం తగ్గుతుందని, లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గుతాయని వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వ్యవస్థలను నవీకరించడం వల్ల భారత పోర్టుల గ్లోబల్ పోటీ శక్తి మరింతగా పెరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ సంస్కరణలు పారదర్శకంగా, సమానంగా అమలవుతాయని, దేశంలోని ప్రతి పోర్టుకు ం ఆంధ్రప్రదేశ్ పోర్టులను కూడా కలుపుకుని ం ఈ ఫ్రేమ్‌వర్క్ వర్తిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. దీంతో పోర్టు మౌలిక వసతుల్లో, డిజిటల్ సేవల్లో, కార్గో హ్యాండ్లింగ్ వ్యవస్థలో ఏకరూపత నెలకొని, రాష్ట్ర పోర్టులకు ప్రత్యక్ష ప్రయోజనం చిక్కనుంది. పోర్టు పారిశ్రామిక రంగంలో డిజిటల్ రూపాంతరం, ఖర్చు తగ్గింపు, పారదర్శకతను సాధించడంలో ఒఎన్ఒపి కీలక పాత్ర పోషించనుందన్నారు.. దీంతో భారత్ సముద్ర లాజిస్టిక్స్ రంగంలో ప్రపంచ స్థాయిలో మరింత ముందుకు సాగుతుందని కేంద్రం నమ్ముతుందని కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ రాజ్యసభలో వెల్లడించారు.

# ఘనంగా ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన 25 వసంతాల వేడుకలు




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్వై) ప్రారంభించి 25సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కాకినాడ జేఎన్టీయూ అల్లూమ్ని ఆల్టోరియంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో జేఎన్టీయూ సహకారంతో ఏర్పాటుచేసిన రెండు రోజుల సెమినార్ మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీర్ చీఫ్ బి.బాలునాయక్, జేఎన్టీయూ వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, ప్రొఫెసర్ ప్రసాద్ రాజు, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి ఈ పీఎంజీఎస్వై స్కీం గ్రామీణ భారత్ ఉన్నతికి ఎంతోగానో ఉపయోగ పడిందన్నారు. ఈ పథకాన్ని తాను చదువుకున్న రోజుల్లో చాలా కీలకమైన పథకంగా భావించేవారుమని ఆయన తెలిపారు. 2000 సంవత్సరంలో ప్రారంభించిన రోడ్లను, ఇతర ప్రాజెక్టులను ఇప్పుడు తిరిగి పరిశీలించాలన్నారు. ప్రస్తుత జనాభా, ఉన్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని రీలైనింగ్, రోడ్లను వెడల్పు చేయడం, వంటి ఇతర అంశాల బలోపేతం చేయడంపై ప్రధానంగా అధికారులు దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. డిసెంబర్ 9, 10 తేదీల్లో రెండు రోజులు పాటు జరిగే ఈ వర్క్ షాప్ ను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ బాలు బి. నాయక్ మాట్లాడుతూ..2000 సంవత్సరంలో అప్పటి దేశ ప్రధాని అటల్ బీహార్ వాజపేయి పుట్టినరోజు సందర్భంగా ఈ పీఎంజీఎస్వై పథకం ప్రారంభమైందన్నారు. అప్పటి నుంచి నేటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో మంచి రహదారి సౌకర్యం కల్పించడం తమ పంచాయతీరాజ్ శాఖ అదృష్టంగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ వేల కిలోమీటర్ల రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించామని భవిష్యత్తులోను మరింత నాణ్యతతో సకాలంలో పనులు పూర్తి చేసేందుకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ తమ వంతు కృషి చేస్తుందని ఆయన తెలిపారు. జేఎన్టీయూ వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ.. తాను వరంగల్ ఆర్ఇసిగా ఉండగా రాష్ట్ర టెక్నికల్ ఏజెన్సీ ద్వారా వేల కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లకు సాంకేత సహకారం అందించడం జరిగిందని గుర్తు చేసుకున్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు సంబంధించి ప్రధానమంత్రి గ్రామీ సడక్ యోజన 25 సంవత్సరాలు వేడుకల్లో తాను తాను భాగం కావడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ ఎస్ఈ ఎవీఎస్. శ్రీనివాస్, అమలాపురం ఎస్ఈ పి.రామకృష్ణ, తూర్పుగోదావరి జిల్లా ఎస్ఈ బాలకృష్ణ, పి పృధ్వి రాజ్ పాల్గొన్నారు. ఏపీపీఆర్డీ ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి

# కూటమి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రహదారుల నిర్మాణం, అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం గొంధి కొత్తపల్లి గ్రామం నుండి అచ్చంపేట మీదుగా కొత్తూరు వరకు సుమారు 6 కిలోమీటర్ల పొడవునా రూ. 2.20 కోట్లతో తారు రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే సత్యప్రభ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ఉన్న గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనున్నదని, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. టిడిపి సీనియర్ నేతలు పర్వత సురేష్, వెన్నా శివ మాట్లాడుతూ గత ప్రభుత్వాల పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ గాడిలో పెట్టి, అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే సత్యప్రభ చిత్తశుద్ధితో పనిచేస్తూ, నియోజకవర్గంలో రోడ్ల రూపురేఖలు మారుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి ఒక సూర్యకిరణ్, తుని ప్రాంతీయ ఆత్మ సంఘం ఉపాధ్యక్షుడు కరణం సుబ్రహ్మణ్యం, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గాబు సుభాష్, ఉపాధ్యక్షుడు తలపంటి అప్పారావు (బుజ్జి), అధిక సంఖ్యలో ఎన్.డి.ఏ. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి నుంచి సౌత్‌జోన్ యూనివర్సిటీల వాలీబాల్ పోటీలు

242 యూనివర్సిటీల నుంచి 138 జట్లు - కాకినాడ జేఎన్టీయూ వేదికగా ప్రారంభం



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** డిసెంబర్ 10 నుంచి కాకినాడ జేఎన్టీయూ వేదికగా సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలు ప్రారంభం కానున్నాయని వైస్‌చాన్స్‌లర్ సిఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఈ పోటీలు ఐదు రోజుల పాటు జరుగనున్నాయని చెప్పారు. ఈ వాలీబాల్ పోటీలపై మంగళవారం జేఎన్టీయూకే వీసీ చాంబర్ హాలులో విలేకరులతో సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల యూనివర్సిటీలకు చెందిన మొత్తం 138 జట్లు పాల్గొననున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 2,200 మంది క్రీడాకారులు పాల్గొననున్నారని, అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. డిసెంబరు 10 ఉదయం నిర్వహించే ప్రారంభ కార్యక్రమానికి పలువురు గౌరవాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ఆదిత్య యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ కళాశాల, జేఎన్టీయూలో రెండు గ్రౌండ్లలో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. వాలీబాల్ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని, క్రీడా మైదానాలు, వసతి సదుపాయాలు, వైద్య బృందాలు సిద్ధంగా ఉంచినట్లు నిర్వాహకులు చెప్పారు. నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ పోటీలలో నాలుగు గ్రూపులుగా విభజించామని చెప్పారు విజేతలైన ఆటగాళ్లకు నగదు పురస్కారాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. పాల్గొన్న ప్రతీ క్రీడాకారుడికి ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తామని దీనివల్ల ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని చెప్పారు. 2011 నుంచి జేఎన్టీయూకే లో వివిధ రకాల క్రీడల పోటీ నిర్వహిస్తున్నామని వాలీబాల్ పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారి అని వీసీ ప్రసాద్ చెప్పారు. డిసెంబరు 16న ఈ పోటీలు ముగియనున్నాయని ప్రసాద్ చెప్పాడు ఈ సమావేశంలో స్టూడెంట్ స్పోర్ట్స్ విభాగ డైరెక్టర్ ఏ కృష్ణమోహన్, రెక్టార్ పి సుబ్బారావు, ఓఎస్డి డి కోటేశ్వరరావు, పివి రమణ, జివి రాజు, జి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



# పూలే అంబేద్కర్ భవనం శరవేగంగా పనులు

## భవన నిర్మాణ సమీక్షించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి గట్టున ప్రతిష్ఠాత్మకంగా రివర్ ఫ్రెంట్ అభివృద్ధి చేసుకుంటున్న నేపథ్యంలో గట్టు ఎదురుగా నిర్మిస్తున్న పూలే అంబేద్కర్ భవన పనులు రూ. 2కోట్ల 5లక్షలతో శరవేగంగా జరుగుతున్నాయని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. దేశంలో ఎక్కడైనా సరే, అంబేద్కర్ భవన్, పూలే భవన్‌లు వేరువేరుగా చాలా చోట్ల ఉన్నాయని, రెండూ కలిపి నిర్మిస్తున్న భవనం ఇదేనని ఆయన అన్నారు. ఇక్కడ బడుగు బలహీన వర్గాలు ఎక్కువగా ఉండడంతో వారి ఆలోచనలకు అనుగుణంగా నిర్మిస్తున్నామని తెలిపారు. గోదావరి గట్టు ఎలక్ట్రిసిటీ ఆఫీసు సమీపంలో నిర్మాణంలో ఉన్న పూలే అంబేద్కర్ భవన్‌ను ఎమ్మెల్యే వాసు మంగళవారం కూటమి నాయకులు, అధికారులతో కల్సి పరిశీలించారు. అభివృద్ధి పనులను సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సహకారంతో గత ఏడాది రూ. 80లక్షలు, ఈ ఏడాది రూ 50లక్షలు ఎంపీ లాడ్స్ మంజూరు కావడంతో టెండర్లు పిలిచి పనులు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎపి పేపర్ మిల్లు నుంచి రూ 50లక్షలు, రాజ్యసభ సభ్యులు బీరం మస్తాన్ రావు యాదవ్ సహకారంతో ఎంపీ లాడ్స్ రూ 25లక్షలు తీసుకు రావడం జరిగిందని ఆయన చెప్పారు. అవి కూడా టెండర్లు పిలిచి పనులు





జరుగుతున్నట్లు తెలిపారు. మరో రూ. 80లక్షలు తీసుకొస్తే మొత్తం పనులు సమగ్రంగా పూర్తికాగలవని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఈమేరకు నిధులు కావాలని పార్లమెంట్, రాజ్యసభ సభ్యులను అడిగామని ఆయన తెలిపారు. వాళ్ళు కూడా హామీ ఇచ్చారని, మరో ఐదారు నెలల్లో పనులు పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని చూస్తునట్టు ఆయన చెప్పారు. పైన విద్యార్థులు వసతి పొంది, స్టడీ సర్కిల్ గా వినియోగించుకునేలా చేయాలన్నది మూల్ నివాస్ వేదిక ఆశయమని, ఈ ఆలోచనను గౌరవిస్తూ తగు కార్యక్రమాలు తీసుకుంటామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. కార్పొరేషన్ పరంగా చేసేవి చూస్తూనే, లోక్ సభ, రాజ్య సభ సభ్యుల నుంచి ఎంపీ లాడ్స్ తీసుకురావడంతో పాటు అధికంగా సిస్సార్ నిధులు కూడా సమీకరించాల్సిన బాధ్యత ఉందని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఈ 18నెలల్లో రాజమండ్రి సిటీ నియోజక వర్గం నుంచి రూ 6కోట్లకు పైగా సిఎస్సార్ నిధులు తీసుకు వచ్చి, తమ చిత్తశుద్ధి నిరూపించామని గర్వంగా చెబుతున్నామని ఆయన అన్నారు. ఇప్పటివరకూ ఏ శాసనసభ్యుడు ఇంతపెద్ద ఎత్తున సిఎస్సార్ నిధులు తీసుకురాలేదని, ఇలా తేవడం సామాన్య విషయం కాదని ఎమ్మెల్యే వాసు అన్నారు. మరో రూ. 80లక్షలు కూడా సిఎస్సార్ నిధులు తీసుకు రాబోతున్నామని, ఈ నిధులతో ఎక్కువగా విద్యకు, వైద్యానికి, కమ్యూనిటీ హాల్స్‌కి ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆయన వివరించారు. ఈ 18 నెలల్లో ఇంతపెద్ద మొత్తంలో సిఎస్సార్ నిధులు తీసుకువచ్చామని, మరి గత ఐదేళ్లలో సిఎస్సార్ నిధులు ఏమైపోయాయని ఎమ్మెల్యే వాసు ప్రశ్నించారు. ఇప్పుడు కూటమి హయాంలో ఇచ్చిన సంస్థలు గతంలో కూడా సిఎస్సార్ నిధులు ఇచ్చే అవకాశం ఉందని, మరి ఎక్కడికి పోయాయని ఆయన అన్నారు. చేతకాని తనమా, సూట్ కేసులకు కక్కుర్తిపడి వదిలేశారా అనేది ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం గత పాలకులకు ఉందన్నారు. పుష్కరాల సమీక్ష సందర్భంగా నగరంలో డ్రైనేజి కోసం రూ 100కోట్లతో అంచనాలు తయారుచేయ మనడం, అవి తయారవ్వడం అయిందని ఆయన చెప్పారు. ప్రతివార్డులో పనుల అంచనాలు, ఘాట్ లో అభివృద్ధి, కొత్త ఘాట్ ల ఏర్పాటు వంటివి కూడా అంచనాలు సిద్ధంగా ఉన్నాయని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఇంకా ఏడాదిన్నర పైగా కాలం ఉందని, అప్పటికప్పుడు కాకుండా ప్రణాళికా బద్ధంగా పనులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఘాట్ లు కూడా కట్టేసి వదిలేయకుండా అక్కడ టూరిజం అభివృద్ధిలో భాగంగా ఫుడ్ కౌంటర్లు ఏర్పాటుచేయడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కూటమి నాయకులు,నగర పాలక సంస్థ అధికారులు ఆయన వెంట ఉన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటీకరణను రద్దు చెయ్యాలి

## వైసిపి లీగల్ సెల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కోటి సంతకాలు సేకరణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళవారం ఉదయం వైఎస్ఆర్సీపీ నిర్వహిస్తున్న ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం కాకూడదని ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నిరసనలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం న్యాయవాదులు జిల్లా కోర్ట్ బయట వైఎస్ఆర్సిపి లీగల్ సెల్ న్యాయవాదులు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినారు. ఈ కార్యక్రమంలో పివివిఎస్‌బి రాజు, సాదిక్ హుస్సేన్, హస్సిన బేగం, డివివి త్రినాద్, రూపా రాజేశ్వరి, సుమన్ పాల్, జంగా రాజశేఖర్, కేఎస్‌విఎస్ రాజు, బడుగురాజు, కే.నంద, చెరుకూరి రామారావు చౌదరి, ఫిలిప్, వీరరాజు, ఎం ఏ బాషా, సి పి ఆర్ రెడ్డి, బడుగు ముసలయ్య, ఎస్ నాగేశ్వరావు, అనూష, ధర్మ, సునంద, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహ పాసింజర్

# ఆటో యూనియన్ అధ్యక్షునిగా నాగేశ్వరరావు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహ పాసింజర్స్ ఆటో యూనియన్ అధ్యక్షునిగా మొఖమాటి నాగేశ్వరరావు ఎన్నికైనట్లు సింగారపు వెంకటేశ్వరరావు తదితరులు వెల్లడించారు. మంగళవారం కోరుకొండ దేవుని కోనేరు వద్ద పాసింజర్ ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఓటు ద్వారా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ అధ్యక్షునిగా మొఖమాటి నాగేశ్వరరావు, సెక్రెటరీ చిన్న రాజారత్నం, కోశాధికారి ఎల్లపు అప్పలరాజు తదితరులు ఎన్నికయ్యారు. యూనియన్ గౌరవ అధ్యక్షులుగా ఎన్ఎస్ఎస్ చంద్రశేఖర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పిల్లా వెంకటేశ్వరరావు, గోకరకొండ శ్రీను, పేరారపు సుందరం, శరకణం వెంకటరమణ, రెడ్డి కామేశ్వరరావు, వనం గంగాధర్, చిటికెన చల్లా రావు తదితరులు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.

# ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి ఉమెన్ ఉషు క్రీడా పోటీలు ప్రారంభం

## ముఖ్య అతిథిలుగా హాజరైన ఎమ్మెల్యే బత్తుల, మాజీ ఎంపీ మార్గాని భరత్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మార్షల్ ఆర్ట్స్ క్రీడల వలన బాలికలకు ఆత్మస్థైర్యం పెరుగుతుందని రాజానగరం ఎమ్మెల్యే బొత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మాజీ కార్పొరేటర్, వైఎస్ఆర్సిపి నాయకులు అజ్జరపు వాసు ఆధ్వర్యం లో రాజమహేంద్రవరం, మోరంపూడి సెంటర్లో ఉన్న ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ ఫంక్షన్ హాల్ లో ఏపీ స్టేట్ ఉమెన్ ఉషూ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ,మాజీ ఎంపీ మార్గాన్ని భరత్ రామ్ హాజరయ్యారు.రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ఉమెన్ ఉషూ పోటీలను తిలకించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఒత్తులు బలరామకృష్ణ మాట్లాడుతూ ఖేలో ఇండియా క్రీడల్లో భాగంగా మాజీ కార్పొరేటర్ వాసు ఆధ్వర్యంలో జరుగుతున్న ఉషూ పోటీలకు వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. మార్షల్ ఆర్ట్స్ క్రీడల వలన బాలికలలో మానసిక స్థితి దృఢపడి జీవితంలో కష్టాలు,నష్టాలను ఎదుర్కొనేందుకు మానసిక స్థైర్యం ఉంటుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయ్ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా క్రీడలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలో ఉమెన్ ఉషూ పోటీలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసును అభినందించారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ అనే మాట్లాడుతూ రాజమండ్రిలో ఖేలో ఇండియా క్రీడలలో భాగంగా రాష్ట్రస్థాయి ఉమెన్ ఉషూ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి క్రీడల వల్ల మహిళలలో సెల్ఫ్ డిఫెన్స్( స్వీయ రక్షణ ) అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఉష క్రీడా మదర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ అని తెలిపారు. ఈ క్రియా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని వివరించారు. క్రీడా నిర్వాహకులు మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలను నేషనల్ అథెలెట్ అకాడమీ గుర్తించిందని తెలిపారు. జిల్లా సెక్రెటరీ ఆర్. సుందర్ రావు, ప్రెసిడెంట్ తాను కలిసి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో సుమారు 250 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులు చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమం లో అధ్యక్షులు ఎం.ఆదిశేషు, సెక్రటరీ వీ. నరసింహారావు,జిల్లా ప్రెసిడెంట్ వాసు సెక్రటరీ ఆర్ సుందరం తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో నీటిశుద్ధి యంత్రాల ప్రారంభం




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా విద్యార్థుల ఆరోగ్యం, పారిశుధ్య పరిరక్షణకు ప్రాధాన్యత నిస్తూ గుంటూరు సీజీఎస్‌టి ఆడిట్ కమిషనరేట్, విశాఖపట్నం జోన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని 10 ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రాలను ఏర్పాటు చేసి, మంగళవారం సిజిఎస్‌టి ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్ కుమార్ ప్రారంభించారు. సుమారు రూ2.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ యంత్రాల ద్వారా 726 మంది విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటి సౌకర్యం లభించనుంది. తాగునీరు అందుబాటులో ఉండడం ద్వారా విద్యార్థుల్లో నీరు ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించవచ్చని అధికారులు తెలిపారు.

**ఒక నెలలో మూడు ప్రాజెక్టులు పూర్తి**

స్వచ్ఛ భారత్ యాక్షన్ ప్లాన్ కింద ఎపి రాష్ట్రంలో మొదటి ప్రాజెక్ట్ నెల్లూరులో, రెండవది విశాఖపట్నం ఏకలవ్య కాలనీలో, ఇప్పుడు మూడవదిగా రాజమహేంద్రవరం పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రాల ఏర్పాటు పూర్తి కావడం, కమిషనరేట్ సేవా కార్యక్రమాల పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తున్నది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.30 లక్షల అంచనా వ్యయంతో పది అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. నెల్లూరు, తిరుపతి ప్రభుత్వ హాస్టళ్లలో ఆర్ ఓ ప్లాంట్లు, శానిటరీ న్యాప్కిన్ వెండింగ్ మెషీన్లు, దోమతెరల పంపిణీకి రూ 6.80 లక్షలు కేటాయించారు. గుంటూరు జిల్లా మల్లెపాడులో శ్మశాన వాటికలో 15 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.

**బాలికల నమోదు పెరిగే అవకాశం**

పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో భాగంగా విశాఖపట్నం జిఎస్‌టి భవన్‌లో శుభ్రతా కార్యక్రమం, నెల్లూరు జిల్లాలో మొక్కల నాటకం, బీచ్ రోడ్‌లో శుభ్రతా డ్రైవ్ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పబ్లిక్ స్కూల్‌లో బాలికల కోసం ప్రత్యేక మరుగుదొడ్డి, వాషింగ్ సౌకర్యాలు ఏర్పాటుచేయడం వల్ల గతంలో సౌకర్యాల లేమితో మధ్యలోనే బడి మానివేసిన బాలికలు తిరిగి పాఠశాలకు రావడం ప్రారంభమై, విద్యార్థినుల నమోదు 20% వరకూ పెరిగే అవకాశం ఉందని పాఠశాల నిర్వహణ తెలిపింది. పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్యం పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలకు సిజిఎస్‌టి ఆడిట్ కమిషనరేట్ భవిష్యత్తులో మరిన్ని సేవాముఖ కార్యక్రమాలతో సహకరించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్,సిజిఎస్టి, కాకినాడ ఆడిట్ సర్కిల్ సి.సత్య నారాయణ, తూర్పుగోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, డిప్యూటీ స్కూల్ ఇన్స్పెక్షన్ అధికారి (రాజమహేంద్రవరం అర్బన్)దిలీప్ కుమార్, కాకినాడ ఆడిట్ సర్కిల్‌కు చెందిన సూపరింటెండెంట్లు - పవన్, సునీల్, గౌరవ్, విజయవాడ, శేషుబాబు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# కోరుకొండ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఎస్ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని, పలువురు ఉన్నతాధికారులను మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీనివాస్ కాకినాడ జిల్లా పెద్దాపురం నుండి కోరుకొండ విచ్చేశారు. ఇప్పటివరకు కోరుకొండలో విధులు నిర్వహించిన నాగార్జున విఆర్ కు అయ్యారు. ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ కు పోలీస్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పలువురు ఎన్డీఏ నాయకులు శ్రీనివాస్ ను మర్యాదపూర్వక కలిసి, అభినందనలు తెలియజేశారు.

## చీపురుపల్లి గ్రామంలో టీబి పేషెంట్‌కు

# ఆర్థిక సాయం అందించిన పలివెల



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం చీపురుపల్లి గ్రామానికి చెందిన కందికట్ల రత్నరాజు మూడు నెలలుగా టీబి వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు కుటుంబాన్ని పరామర్శించి 25 కిలోల బియ్యం, 1,000 రూ ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా పలివెల వీరబాబు మాట్లాడుతూ ఈ కుటుంబం పరిస్థితి చాలా దారుణంగా ఉందని ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. దాతలు కూడా ముందుకు వచ్చి రత్నరాజు కుటుంబానికి అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నెంబర్ నందమూరి చిట్టి స్వామి, మహిళా జిల్లా ప్రెసిడెంట్ కురుకూరి కూపమ్మ, మండల కమిటీ నెంబరు చిలకపాటి శ్యామల పాల్గొన్నారు.

# మండల ప్రజాపరిషత్ కార్యాలయము నందు సర్వసభ్య సమావేశం

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు నేడు సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో ఎం. భారతి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశం ఉదయం10:30 గంటలకు ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన ప్రారంభమవుతుందని తెలియజేశారు. ఇందులో భాగంగా 2026 - 2027 కు బడ్జెట్ ఆమోదం పలు అభివృద్ధి కార్యక్రమాలు ఇతర అంశాలపై చర్చ ఉంటుందని అన్నారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ అధ్యక్షులు వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని అన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారానికి

# పాల్పడిన వ్యక్తి అరెస్ట్



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరంలోని గురుకుల బాలికల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తితో పాటు అతనికి సహకరించిన మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు అమలాపురం డి.ఎస్.పి. టి ఎస్ ఆర్ కే ప్రసాద్ తెలిపారు. జిల్లాలో తీవ్ర సంచలనం రేకెత్తించిన ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆయన మీడియాకు వివరించారు. కాట్రేనికోన మండలంలో ఓ గ్రామంలో బాలిక ఇంటి సమీపంలో నివసిస్తున్న మోకా గిరిబాబు, నేరేడుమిల్లి అర్చనా దేవి ఈనెల 3 వ తేదీన హాస్టల్‌కు వెళ్ళి.. అక్కడి సిబ్బందికి బాబాయిగా నమ్మబలికి ఆసుపత్రి నెపంతో బాలికను వారి వెంట తీసుకువెళ్లారన్నారు. అనంతరం అమలాపురంలోని గణపతి లాడ్జ్ చేరుకుని లాడ్జ గుమాస్తా నాగవరపు వెంకటరమణ సహకారంతో బాలికపై గిరిబాబు అత్యాచారానికి పాల్పడినట్లు గుర్తించామన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ముమ్మిడివరం సిఐ మోహన్ కుమార్, ఎస్సై జ్వాలా సాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో బాలిక ఆచూకీ గుర్తించామన్నారు. బాధిత బాలిక ఇచ్చిన వాంగ్మూలం మేరకు కేసు నమోదు చేసి నిందితుడు గిరిబాబుతో పాటు అతనికి సహకరించిన అర్చనాదేవి, వెంకటరమణలను సోమవారం అరెస్ట్ చేశామని, మంగళవారం కోర్టులో హాజరపరిచామన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ బాలికలపై ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఇటీవల తునిలో ఇదే తరహాలో బాలికపై అత్యాచారం జరిగిన సంఘటన మరవక ముందే మరో ఘటన జరగడం పట్ల తల్లితండ్రుల్లో ఆందోళన నెలకొంది.

# ఎస్ఎఫ్ఐ నగర నూతన కమిటీ ఎన్నిక

## - అధ్యక్ష, కార్యదర్శిలుగా ఎస్.కనక, కె.జ్యోతిర్మయి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్.ఎఫ్.ఐ రాజమండ్రి నగర కమిటీ నూతనంగా 19మందితో ఎన్నికయ్యింది అని ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు వై. భాస్కర్,ఎన్. రాజా తెలియజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఎస్.ఎఫ్.ఐ రాజమండ్రి నూతన నాయకత్వానికి అభినందనలు తెలియజేశారు. తూర్పుగోదావరి జిల్లా విస్తృత స్థాయి సమావేశం 10 తేదీన జరుగుతుందని ఈ సందర్భంగా రేపు ర్యాలీ, బహిరంగ సభ జరుగుతుందని ఈ ర్యాలీ, బహిరంగ సభలో విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ముఖ్య అతిథిగా ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర అధ్యక్షులు పి. రామ్మోహన్ హాజరవుతారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లాలో ఉన్న అని సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నామన్నారు.రాజమండ్రి నగర నూతన అధ్యక్ష, కార్యదర్శిలుగా ఎస్. కనక, కె. జ్యోతిర్మయి నగర ఉపాధ్యక్షులుగా సౌమ్య, లహరి, సహాయక కార్యదర్శిలుగా కార్తిక్, చక్రి కమిటీ సభ్యులు హేమంత్, బాలాజీ, సాహితి, నందిని, తను, సాయి, సంధ్య, ఆఫ్రిన్, కోటీశ్వరి, బిందు, చాందిని, నాగ చైతన్య, శ్రీవల్లి ఎన్నికయ్యారన్నారు.

# కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌వివిఎస్ మూర్తి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా సింగంశెట్టి వీర వెంకట సత్యనారాయణమూర్తి సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శించుకుని, పలువురు ఉన్నతాధికారులను మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం తన కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ కోరుకొండ సర్కిల్ పరిధిలోని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ తాను గతంలో బందర్, అవనిగడ్డ, విజయవాడ సిటీ, విజయవాడ రూరల్, రాజమహేంద్రవరం, తుని తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించినట్లు తెలిపారు. తన సర్కిల్ కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాలలో ఇటువంటి ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించిన సహించేది లేదని హెచ్చరిస్తూ, యువత గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువులు చక్కగా అభ్యసించాలన్నారు. వాహనదారులు వాహన రికార్డులను సక్రమంగా ఉంచుకొని, హెల్మెట్ ధరించాలని, త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్సు లేకపోయినా భారీ పెనాల్టీలు తప్పవన్నారు. అదేవిధంగా ప్రజలకు వివిధ కేసుల్లో సత్వర న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ప్రజలు పోలీసులకు సంబంధించిన ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు.






# ఎట్టకేలకు వీడిన ఉత్కంఠ..

## అఖండ-2 విడుదలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్.. రిలీజ్ డేట్ ఇదే..!!

నందమూరి అభిమానులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్న సినిమా అఖండ 2. భారీ అంచనాల మధ్య డిసెంబర్ 5న విడుదల కావాల్సిన సినిమా చివరి క్షణంలో వాయిదా పడిన సంగతి తెలిసిందే. రిలీజ్ చేయడానికి కొన్ని గంటల ముందు సినిమాను పోస్ట్ పోన్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించడంతో ఫ్యాన్స్ తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇప్పుడు బాలయ్య అభిమానులకు శుభవార్త వచ్చేసింది. ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో మోస్ట్ అవైటెడ్ సినిమాల్లో అఖండ 2 ఒకటి. భారీ అంచనాల మధ్య రూపొందించిన ఈ సినిమా విడుదల కోసం నందమూరి ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నందమూరి బాలకృష్ణ హీరో డైరెక్టర్ బోయపాటి శ్రీను ఈ మూవీని రూపొందించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేశాయి. ఇందులో బాలయ్య నట విశ్వరూపం చూపించనున్నారని ముందు నుంచి పోస్టర్స్, టీజర్ పై బజ్ క్రియేట్ చేశారు మేకర్స్. డిసెంబర్ 5న ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. అప్పటికే బాలయ్యతోపాటు చిత్రయూనిట్ సైతం జోరుగా ప్రమోషన్స్ నిర్వహించారు. కానీ చివరి క్షణంలో ఈ సినిమా విడుదలను వాయిదా వేశారు. ఫైనాన్షియల్ వివాదాల కారణంగా ఈ సినిమా రిలీజ్ అగిపోయింది. 14 రీల్స్ ఎంటర్టైన్మెంట్స్ నుంచి తమకు రావాల్సిన రూ.28 కోట్ల బకాయిని చెల్లించేవరకు అఖండ 2 సినిమాను నిలిపివేయాలని బాలీవుడ్ నిర్మాణ సంస్థ ఈరోస్ ఇంటర్నేషనల్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది. ఈరోస్ వాదనలతో ఏకీభవించిన కోర్టు అఖండ2 సినిమాపై స్టే విధించింది. ఇప్పుడు సినిమాకు సంబంధించిన ఫైనాన్షియల్ సమస్యలు అన్ని క్లియర్ అయ్యాయి. దీంతో అఖండ 2 సినిమా విడుదలకు మద్రాసు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పుడు ఈ చిత్రాన్ని వీలైనంత త్వరగా రిలీజ్ చేయాలని భావిస్తున్నారట మేకర్స్. ప్రస్తుతం ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం అఖండ 2 చిత్రాన్ని డిసెంబర్ 12న రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. రెండు తెలుగు రాష్ట్రాల్లో డిసెంబర్ 11న రాత్రి నుంచి ప్రీమియర్ షోలు పడనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ సినిమా విడుదల పై అధికారిక ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా.. తమన్ సంగీతం అందిస్తున్నారు.



# 43 ఏళ్ల అందానికి రహస్యం ఇదే..

## ఫుడ్ కాదు.. రోజూ ఆ పని చేయడం ముఖ్యమంటున్న శ్రియ..

అందాల భామ శ్రియ శరణ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తెలుగు, తమిళంతోపాటు హిందీలోనూ తనదైన ముద్ర వేసింది. ఒకప్పుడు కుర్రాళ్ల ఫేవరేట్ హీరోయిన్ ఆమె. తక్కువ సమయంలోనే భారతీయ సినిమా ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన ఈ అమ్మడు ఇప్పటికీ సినిమాల్లో బిజీగా ఉంటుంది. తాజాగా ఈ అందాల భామ బ్యూటీ సీక్రెట్స్ గురించ బయటపెట్టింది. దక్షిణాది సినిమా ప్రపంచంలో ఒకప్పుడు చక్రం తిప్పిన హీరోయిన్లలో శ్రియ ఒకరు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషలలో నటించి తనకంటూ మంచి పేరు తెచ్చుకుంది. అందం, అభినయంతోపాటు కథక్ డ్యాన్సర్ గానూ శ్రియ ఫేమస్. ఇప్పటికీ సినిమాల్లో బిజీగా దూసుకుపోతుంది. ఒకప్పుడు వరుస సినిమాలతో దూసుకుపోయిన శ్రియ.. ఇప్పుడు మాత్రం అవకాశం వస్తే ఎలాంటి పాత్రలోనైనా కనిపించేందుకు రెడీగా ఉంటుంది. ఇప్పుడు సహాయ నటిగా రాణిస్తుంది. తెలుగు, తమిళం భాషలలో పలు చిత్రాల్లో నటించారు. దాదాపు రెండు దశాబ్దాలకుపైగా సినిమాల్లో నటిస్తున్నారు. 2018లో తన ప్రియుడు ఆండ్రీ కోస్కీవ్ ను వివాహం చేసుకున్నారు శ్రియా. వీరికి రాధ అనే అమ్మాయి ఉంది. పెళ్లి తర్వాత కొన్నాళ్లపాటు సినిమాలకు దూరంగా ఉన్న శ్రియ.. ఇప్పుడు తిరిగి సినిమాల్లో యాక్టివ్ అయ్యారు. కథానాయికగా కాకుండా పలు పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం శ్రియ వయసు 43 సంవత్సరాలు. ఇప్పటికీ గ్లామర్, బ్యూటీ విషయంలో ఏమాత్రం తగ్గడం లేదు. ఇటీవల సూర్య నటించి రెట్రో చిత్రంలో స్పెషల్ సాంగ్ చేసింది. అలాగే మిరాయ్ చిత్రంలో భూమిక పాత్రలో కనిపించారు. తాజాగా తన బ్యూటీ సీక్రెట్స్ విషయాలను బయటపెట్టారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం ముఖ్యమంటుంది. అలాగే ఆహారపు అలవాట్లు సైతం జాగ్రత్త తీసుకుంటుందట. మంచిని వినడం, మంచిని చూడడం, మంచి చేయడం కూడా అందానికి రహస్యమే అంటుంది. యోగా, సైక్లింగ్, జిమ్ చేయడం కూడా ఫిట్నెస్ సీక్రెట్స్ అంటుంది.




# రూ. 43.4 కోట్లతో భారీ స్కెచ్..

## 'ఎల్లో ఆర్మీ' టార్గెట్ ప్లేయర్స్ లిస్ట్ చూస్తే పరేషానే..



మొత్తం మీద, ఈ వేలంలో సిఎస్కె తన కోల్పోయిన కోర్ గ్రూప్ స్థానాలను భర్తీ చేయడానికి, ముఖ్యంగా ఆల్రౌండర్లు, స్పిన్నర్ల కోసం తమ భారీ పర్స్‌ను ఉపయోగించనుంది. 'తలా' ధోని వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయో చూడాలంటే డిసెంబర్ 16న అబుదాబిలో జరిగే మినీ-వేలం వరకు వేచి చూడాలి.

ఐదు సార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ (సిఎస్కె ) రాబోయే ఐపీఎల్ 2026 సీజన్ కోసం భారీ మార్పులతో సిద్ధమవుతోంది. ముఖ్యంగా కీలక ఆటగాళ్లు జట్టును వీడటం, కొందరు రిటైర్ అవ్వడం వంటి పరిణామాల నేపథ్యంలో, మినీ-వేలంలో తమ జట్టును పటిష్టం చేసుకోవడానికి "ఎల్లో ఆర్మీ" ఒక పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది.

**ట్రేడ్ డీల్:** ఈ వేలానికి ముందు సిఎస్కె తీసుకున్న అత్యంత సంచలనాత్మక నిర్ణయం.. లెజెండరీ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, ఇంగ్లాండ్ స్టార్ సామ్ కరన్‌లను రాజస్థాన్ రాయల్స్‌కు (ఆర్ఆర్) పంపి, బదులుగా వికెట్ కీపర్-బ్యాటర్ సంజు శాంసన్‌ను తమ జట్టులోకి తీసుకురావడం.

**కీలక విడుదలలు:** గత సీజన్‌లో నిరాశపరిచిన రచిన్ రవీంద్ర, మతీష పతిరణ, డేవాన్ కాన్వే వంటి విదేశీ ఆటగాళ్లతో పాటు దీపక్ హుడా, విజయ్ శంకర్, రాహుల్ త్రిపాఠి వంటి భారత ఆటగాళ్లను కూడా సిఎస్కె విడుదల చేసింది.

**రిటెన్షన్:** కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, ఎంఎస్ ధోని (ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడే అవకాశం), శివమ్ దూబే వంటి కోర్ ఆటగాళ్లను అట్టిపెట్టుకుంది.

**వేలం పర్స్:** ఈ మార్పుల కారణంగాసిఎస్కె వద్ద వేలంలో ఖర్చు చేయడానికి రూ. 43.4 కోట్ల భారీ పర్స్ మిగిలి ఉంది.

%ఙూఖ% ప్రధాన లక్ష్యాలు..

జడేజా, సామ్ కరన్, అశ్విన్ (రిటైర్మెంట్) లేకపోవడం వల్ల ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడంపైనే చెన్నై ప్రధానంగా దృష్టి సారించింది. ముఖ్యంగా ఒక విదేశీ ఓపెనర్, నాణ్యమైన స్పిన్నర్, పవర్-హిట్టింగ్ ఆల్‌రౌండర్ కోసం చూస్తోంది.

1. పవర్-హిట్టింగ్ ఆల్‌రౌండర్‌లు: సామ్ కరన్ స్థానంలో ఒక శక్తివంతమైన పేస్ ఆల్‌రౌండర్ కోసం సిఎస్కె తీవ్రంగా ప్రయత్నించనుంది.

**ఆండ్రీ రస్సెల్:** సుదీర్ఘ కాలం సిఎస్కె తరపున ఆడిన విండీస్ విధ్వంసక వీరుడు ఆండ్రీ రస్సెల్‌ను కొనుగోలు చేయడానికి సిఎస్కె పక్కా ప్లాన్ వేసింది. లోయరార్డర్‌లో అతని విధ్వంసక బ్యాటింగ్, కీలకమైన ఓవర్లలో బౌలింగ్ వేయగల సామర్థ్యం సిఎస్కెకి సరిగ్గా సరిపోతుంది.

**కామెరూన్ గ్రీన్:** రస్సెల్ దక్కకపోతే, ఆస్ట్రేలియా యువ సంచలనం కామెరూన్ గ్రీన్‌ను టార్గెట్ చేయవచ్చు.

**2. నాణ్యమైన స్పిన్నర్లు:** జడేజా, అశ్విన్ జట్టులో లేకపోవడంతో స్పిన్ విభాగంలో పటిష్టత చాలా అవసరం.

రవి బిష్ణోయ్ / రాహుల్ చాహర్: అఫ్గానిస్థాన్ స్పిన్నర్ నూర్ అహ్మద్‌తో పాటు ఒక అనుభవజ్ఞుడైన భారత లెగ్ స్పిన్నర్ కోసం సిఎస్కె చూస్తోంది. రవి బిష్ణోయ్ లేదా చెపాక్ పిచ్‌కు బాగా సరిపోయే రాహుల్ చాహర్‌ను దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేయవచ్చు.

**3. టాప్-ఆర్డర్ బ్యాటర్లు:** సంజు శాంసన్ జట్టులోకి వచ్చినా, గైక్వాడ్‌తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు ఒక విదేశీ ఓపెనర్ అవసరం.

గతంలో విడుదల చేసిన ప్లేయర్‌లను తిరిగి కొనుగోలు చేసే అవకాశం కూడా ఉంది. ఒకవేళ సంజు శాంసన్ మిడిల్ ఆర్డర్‌లో ఆడితే, మరొక స్టార్ ఓపెనర్‌ను టార్గెట్ చేయవచ్చు.

### రవిచంద్రన్ అశ్విన్ సలహా..

టీమిండియా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా సిఎస్కె కు కొందరు ఆటగాళ్ల పేర్లను సూచించారు. నితీష్ రాణా, వెంకటేష్ అయ్యర్: మిడిలార్డర్‌ను బలోపేతం చేయడానికి నితీష్ రాణా, వెంకటేష్ అయ్యర్‌లను తీసుకోవాలని అశ్విన్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా నితీష్ రాణా స్క్వేర్ బౌండరీలను సులభంగా బాదగల సామర్థ్యం సిఎస్కె కి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మొత్తం మీద, ఈ వేలంలో సిఎస్కె తన కోల్పోయిన కోర్ గ్రూప్ స్థానాలను భర్తీ చేయడానికి, ముఖ్యంగా ఆల్‌రౌండర్లు, స్పిన్నర్ల కోసం తమ భారీ పర్స్‌ను ఉపయోగించనుంది. 'తలా' ధోని వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయో చూడాలంటే డిసెంబర్ 16న అబుదాబిలో జరిగే మినీ-వేలం వరకు వేచి చూడాలి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
విద్యా వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com